ANN తెలుగు
Follow: @mahaadaily
29-11-2025
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 340 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

**టాప్ న్యూస్**

### పేదల కోసం అర్ధరాత్రి వరకూ కోర్టులో ఉంటా..
- లగ్జరీ వ్యాజ్యాలు ఉండవు.. అవి సంపన్నులు వేస్తున్నారు
- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు



02

### ఎన్నికలపై స్టే ఇవ్వలేం..
- పంచాయతీకి లైన్ క్లియర్
- జీవో 46 అమలు నిలిపివేతకు హైకోర్టు నో



02

### రాజీనామా చేస్తానన్న టీడీపీ ఎమ్మెల్యే
- నేరుగా హైకమాండ్‌కు అల్టిమేటం



02



# జిల్లాలకు సీఎం రేవంత్
## పల్లెలకు.. జూబ్లీహిల్స్ జోష్
### ఎన్నిక ఏదైనా అండగా సీఎం
### పల్లెపోరు సమయంలో.. దూకుడు వ్యూహం
### 90శాతం పంచాయతీల్లో గెలుపే టార్గెట్

జూబ్లీహిల్స్ బైపోల్ లో కాంగ్రెస్ పార్టీని ఒంటిచేత్తో గెలిపించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇపుడు పల్లెపోరులో కాంగ్రెస్ మద్దతుదారులు విజయఢంకా మోగించేందుకు స్కెచ్ రెడీ చేశారు. పల్లెపోరు నామినేషన్ల జోరు ముమ్మరంగా సాగుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన టూర్ కు రెడీ అయ్యారు. సీఎం పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. మొత్తం ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. ఆరు రోజులు ఆరు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించనున్నారు. రాష్ట్రంలోని గ్రామపంచాయతీల ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతుండగా, డిసెంబర్ 30తో నామినేషన్ల ఘట్టం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1 నుండి ప్రచారయాత్రకు సీఎం రెడీ అయ్యారు. 90శాతం పంచాయతీల్లో గెలుపే లక్ష్యం కావాలని సీఎం రేవంత్ మంత్రులు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.

వివరాలు 2లో

### సీఎంతో పీసీసీ చీఫ్ భేటీ
పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కీలకచర్చ

02

### వార్ వన్ సైడే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను, అమలు చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను ఈ పర్యటనల ద్వారా ప్రజలకు నేరుగా వివరించనున్నారు. ఈ పర్యటనలు కేవలం రాజకీయ సభలు కాకుండా, రాష్ట్రంలో కొత్తగా వచ్చిన 'ప్రజా ప్రభుత్వం' పాలనపై గ్రామీణ ప్రజలకు భరోసా ఇవ్వనున్నాయి. ముఖ్యంగా, 'ప్రజలే యజమానులు' అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తమ పార్టీకి బలం చేకూరితే, కేంద్రం నుంచి వచ్చే నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారం కూడా స్థానిక అభివృద్ధికి మరింత బలంగా తోడవుతుందని ప్రజలకు స్పష్టం చేయనున్నారు. ఈ పర్యటనలు సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు జైత్ర యాత్రగా మార్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సీఎం పర్యటనతో వార్ వన్ సైడ్ అవుతుందని భావిస్తున్నారు.



### జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతాం
**సాయుధ పోరాటం విరమిస్తాం**

మావోయిస్టుల లేఖ

**హైదరాబాద్, మహా :** మావోయిస్టులు ఊహించని విధంగా కీలక ప్రకటన చేశారు. ఎంఎంసీ (మహారాష్ట్రమధ్యప్రదేశ్‌ఛత్తీస్‌గఢ్) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో ఓ లేఖను విడుదల చేశారు. వచ్చే సంవత్సరం జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు.

మిగతా 2లో



### ఉద్యోగులకు గుడ్ న్యూస్
- 2026లో సెలవుల జాతర
- కేంద్రం విడుదల చేసిన భారీ సెలవుల జాబితా ఇదే

**హైద్రాబాద్, మహా:** మరో నెల రోజుల్లో 2025 సంవత్సరం ముగిసి, కొత్త సంవత్సరం అడుగుపెట్టనుంది. ఇప్పటికే పాఠశాలలు క్రిస్మస్ సెలవులను ఖరారు చేయగా, తాజాగా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు, విద్యార్థులకు తీపి కబురు అందించింది. 2026 సంవత్సరానికి సంబంధించిన సెలవుల జాబితాను కేంద్రం అధికారికంగా విడుదల చేసింది.

మిగతా 2లో



# 77 అడుగుల రాముడు
**గోవాలో ప్రపంచంలోనే ఎత్తయిన విగ్రహం**

### ఆవిష్కరించిన ప్రధాని మోదీ

**గోవా :** ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఆవిష్కరించారు. దక్షిణ గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పర్తగాలీ జీవోత్తమ్ మఠంలో ఏర్పాటు చేసిన 77 అడుగుల కాంస్య విగ్రహాన్ని ప్రారంభించారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా అక్కడ పర్యటించిన ప్రధాని మోదీ, విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు, సీఎం ప్రమోద్ సావంత్, పలువురు రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. సాధువులు, సంతులతో తనకున్న ఆధాత్మిక అనుబంధాన్ని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రజలు తమ సంస్కృతితో మమేకమయ్యేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ మఠంలో ఉన్న ఆలయాన్ని కూడా దర్శించారు. దీంతో పాటు మఠం అభివృద్ధి చేసిన 'రామాయణ థీమ్ పార్క్ గార్డెన్'ను కూడా మోదీ ప్రారంభించారు. ప్రత్యేక పోస్టల్ స్టాంపు, స్మారక నాణెంను కూడా ఆయన విడుదల చేశారు.

మిగతా 3లో

## కాళోజీ అక్రమాలపై సీఎం సీరియస్
### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం
### సీఎం ఆగ్రహంతో వైస్ ఛాన్స్ లర్ రాజీనామా

**హైదరాబాద్, మహా :** కాళోజీ యూనివర్సిటీ వ్యవహారాలపై పత్రికల్లో వస్తున్న కథనాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో అవకతవకలు, ఇష్టారీతిగా ఇన్‌చార్జీల నియామకం తదితర ఘటనలపై వస్తున్న ఆరోపణలపై సీఎం ఆరా తీశారు. ఈ అంశంపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి సీఎం వివరణ కోరారు. ఉన్నతమైన వర్సిటీలో అస్తవ్యస్థ పరిస్థితులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ఘటనల వెనుక ఎంతటి వారున్నా



ఉపేక్షించే సమస్యే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉన్నత స్థాయి సంస్థల్లో పని చేసేవారు సమర్థంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పని చేయాలని సీఎం సూచించారు.

మిగతా 3లో

## కేసీఆర్‌ది బూటకపు డ్రామా
- తెలంగాణ వచ్చింది కేసీఆర్ దీక్ష వల్ల కాదు.. సోనియా వల్లే
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** ఉనికి కోల్పోతున్న బీఆర్ఎస్ మరో కొత్త డ్రామాకు తెరదీసిందని, 'దీక్ష దివాస్' పేరిట ప్రజలను మోసం చేయడానికి సిద్ధమైందని టీపీసీసీ అధ్యక్షుడు, మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేసీఆర్ బయటికి వస్తే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ ముగిసిన శకం అని కేసీఆర్ స్వయంగా అర్థం చేసుకున్నారని తెలిపారు. ప్రజా సెంటిమెంట్‌ను రాజకీయ లాభం కోసం వాడుకుని కేసీఆర్ కుటుంబమే లబ్ధి పొందింది అని ఆయన ఆరోపించారు.

మిగతా 2లో




### కాళేశ్వరంతో కామారెడ్డికి
## ఒరిగిందేమీ లేదు
**చుక్కనీరు కూడా ఇయ్యలే...**

ఏమన్నా అంటే.. బీఆర్ఎస్ లీడర్లు కంపనోరేసుకుని అరుస్తున్నరు
నా కుటుంబం నుండి దూరం చేసి శునకానందం పొందుతున్నారు

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఒరిగిందేమీ లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. శుక్రవారం కామారెడ్డిలో

మిగతా 2లో



## భారత్‌కు పుతిన్.. షెడ్యూల్ ఖరారు

**మహా:** రష్యా అధ్యక్షుడు పుతిన్ మరికొన్నిరోజుల్లో భారత్‌కు రానున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ కూడా ఖరారైంది. డిసెంబర్ 45 తేదీల్లో ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించింది. రష్యా చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై ఇటీవల అమెరికా అధ్యక్షుడు పుతిన్ అదనపు సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో పుతిన్‌కు భారత్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.



### థాయ్‌లాండ్‌లో భారీ వర్షాలకు 145 మంది మృతి

07



Gold Jewellery
3% V.A ONWARDS
manepally®
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
Diamonds
₹49,950/-
Onwards
E-F / VVS



*T&C Apply
General Bazar 9912010888 | Punjagutta 7893800555 | Kukatpally 8897387888 | Dilsukhnagar 6309111699 | Chandanagar 8712690020 | Suchitra Circle 8712690030

## కాళేశ్వరంతో కామారెడ్డికి ఒరిగిందేమీ లేదు

(మొదటిపేజీ తరువాయి)

కవిత పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం మీడియాతో కవిత మాట్లాడారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. తాను నిజం చెబితే బీఆర్ఎస్ నేతలు కంపనోరు వేసుకుని ఒర్రుతరు.. అయినా నిజం చెబుతున్నా. కాళేశ్వరంతో కామారెడ్డి జిల్లాకు ఒక్క ఎకరాకు కూడా నీరు రాలేదు అని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను తన కుటుంబం నుండి దూరం చేసి కొందరు శునకానందం పొందుతున్నారని, తెలంగాణ సమాజమే తన కుటుంబంలా భావించి పనిచేస్తున్నానన్నారు.

## జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతాం

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కొక్కరు కాకుండా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న లొంగుబాటు, గెరిల్లా వ్యూహకర్త హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ మరింత బలహీనమైందని పేర్కొన్నారు. మిగతావారు కూడా లొంగిపోవాలన్న కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు మూడు రాష్ట్ర ప్రభుత్వాలు సంయమనం పాటించి, భద్రతా కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాలని మావోయిస్టులు కోరారు. జోన్‌లో ఎటువంటి అరెస్టులు కానీ ఎన్‌కౌంటర్‌లు, అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని వారు ప్రత్యేకంగా పేర్కొన్నారు.

**ప్రభుత్వాలు అనుకూల వాతావరణం కల్పించాలి**

2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామని మావోయిస్టులు ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. ఆయుధాలను అప్పగించి ప్రభుత్వం కల్పించే పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే ఏదైనా రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు కొంత సంయమనం పాటించాలని కోరారు. ఈ ప్రక్రియ శాంతియుతంగా పూర్తయ్యేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి, హోంమంత్రి విష్ణుదేవ్ సాయి, విజయ్ శర్మ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌లకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.



# జిల్లాలకు సీఎం రేవంత్

## పల్లెలకు.. జూబ్లీహిల్స్ జోష్

### ఎన్నిక ఏదైనా అండగా సీఎం

### పల్లెపోరు సమయంలో.. దూకుడు వ్యూహం

### 90శాతం పంచాయతీల్లో గెలుపే టార్గెట్

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ బైపోల్ లో కాంగ్రెస్ పార్టీని ఒంటిచేత్తో గెలిపించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇపుడు పల్లెపోరులో కాంగ్రెస్ మద్దతుదారులు విజయఢంకా మోగించేందుకు స్కెచ్ రెడీ చేశారు. పల్లెపోరు నామినేషన్ల జోరు ముమ్మరంగా సాగుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన టూర్‌కు రెడీ అయ్యారు. సీఎం పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. మొత్తం ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. ఆరు రోజులు ఆరు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించనున్నారు. రాష్ట్రంలోని గ్రామపంచాయతీల ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతుండగా, డిసెంబర్ 30తో నామినేషన్ల ఘట్టం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1 నుండి ప్రచారయాత్రకు సీఎం రెడీ అయ్యారు. 90శాతం పంచాయతీల్లో గెలుపే లక్ష్యం కావాలని సీఎం రేవంత్ మంత్రులు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల డీసీసీలతో కాంగ్రెస్ నేతలు కొంత అసంతృప్తిగా ఉన్న నేపథ్యంలో సీఎం పర్యటన మొత్తం క్యాడర్ లో జోష్ తీసుకురానుంది. డిసెంబర్ 1న సొంత జిల్లా మక్తల్ నుండి ప్రచారానికి శ్రీకారం చుడుతున్న సీఎం రేవంత్ జిల్లాలను వ్యూహాత్మకంగా ఎంపిక చేశారు. కొత్తగూడెం, హుస్నాబాద్, ఆదిలాబాద్, నర్సంపేట, దేవరకొండ ప్రాంతాలను సీఎం ఎంపిక చేసుకున్నారు. సీఎం పర్యటనతో క్యాడర్ లో ఉత్సాహం రానుంది.

**కాంగ్రెస్‌ను ఆదరిస్తేగ్రామాలు అభివృద్ధి**

గ్రామ స్థాయి నుంచి బలోపేతమైతేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని విశ్వసించే సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక పాలనలో యువత, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఈ సభల ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వనున్నారు. ఆయన పర్యటనలో ప్రకటించే అభివృద్ధి పథకాలు, స్థానిక సమస్యలపై ఆయన దృష్టి సారించడం వలన సర్పంచ్ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తే తమ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బలంగా విశ్వసించేలా చేయగలరు. ఈ ఆరు రోజుల పర్యటన ముగిసేనాటికి, సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులకు అనుకూలంగా బలమైన సానుభూతి, మద్దతు పెరుగుతాయని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి, ఆయన పాలనకు మొదటి ప్రజామోదం అవుతుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

**సీఎం రేవంత్ పర్యటన షెడ్యూల్ ఇదే**

- డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్
- డిసెంబర్ 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం
- డిసెంబర్ 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్
- డిసెంబర్ 4న ఆదిలాబాద్.. డిసెంబర్ 5న నర్సంపేట
- డిసెంబర్ 6న నల్గొండ జిల్లా దేవరకొండ

## ఎన్నికలపై స్టే ఇవ్వలేం

### పంచాయతీకి లైన్ క్లియర్

### జీవో 46 అమలు నిలిపివేతకు హైకోర్టు నో

**హైదరాబాద్, మహా:** పంచాయతీ ఎన్నికలపై స్టే విధించేందుకు రాష్ట్ర హైకోర్టు నిరాకరించింది. రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ పలు బీసీ సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285ఏని, అలాగే నవంబర్ 22న జారీ చేసిన జీవో నంబర్ 46ని కొట్టివేయడానికి నిరాకరించింది. వివరాలు... రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, న్యాయమూర్తి జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. గ్రామ పంచాయితీ ఎన్నికలపై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ''రాజ్యాంగ నిబంధనల ద్వారా ఆదేశించబడిన ప్రక్రియను ఆపకూడదు'' అని పేర్కొంది. ఎన్నికలను నిలిపివేయకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఉందని ప్రస్తావించింది. ఇందుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది ధర్మాసనం.

**వర్గీకరణ చేపట్టకపోవడంతో రిజర్వేషన్లు తగ్గాయి..**

ఇరువైపు వాదనలు విన్న కోర్టు.... కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 22వ తేదీన జీవో 46ను జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. జనాభా గణాంకాలు లేకుండా రిజర్వేషన్లు కేటాయించారని.... ఏ ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కేటాయించరన్నదానిపై స్పష్టత లేదని పేర్కొన్నారు. బీసీ జనాభాకు సంబంధించి ప్రత్యేక కమిషన్ సమర్పించిన వివరాలను వెల్లడించలేదని పిటిషన్ లో ప్రస్తావించారు. బీసీల్లో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేపట్టకపోవడంతో రిజర్వేషన్లు తగ్గాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. జీవో 46 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ పై గురువారం విచారించిన కోర్టు... శుక్రవారం కూడా వాదనలు వినింది. ఇరువైపు వాదనలు విన్న తర్వాత... స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఉన్నత న్యాయస్థానం స్టే ఇవ్వకపోవటంతో.... ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందుకు సాగనున్నాయి. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన తేదీల్లోనే ఎన్నికలు జరగనున్నాయి. ఈసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... డిసెంబర్ 11,14, 17 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం మొదటి విడత నామినేషన్లు కొనసాగుతున్నాయి.

## పేదల కోసం అర్ధరాత్రి వరకూ కోర్టులో ఉంటా

- లగ్జరీ వ్యాజ్యాలు ఉండవు.. అవి సంపన్నులు వేస్తున్నారు
- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా:** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. పేద కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడటం తన తొలి ప్రాధాన్యమన్న ఆయన.. అవసరమైతే, వారి కోసం అర్ధరాత్రి వరకూ న్యాయస్థానంలో కూర్చుంటానని అన్నారు. తిలక్ సింగ్ డాంగి అనే వ్యక్తి కేంద్ర ప్రభుత్వంతోపాటు ఇతరులపై దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చిన సందర్భంగా సీజేఐ ఈ విధంగా స్పందించారు. తన కోర్టులో లగ్జరీ వ్యాజ్యాలు ఉండవని, ఇటువంటి కేసులను సంపన్నులు వేస్తున్నారని ఈ సందర్భంగా సీజేఐ వ్యాఖ్యానించారు. హరియాణా హిసార్ జిల్లాలోని మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన జస్టిస్ సూర్యకాంత్.. భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబర్ 24న బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. దాదాపు 15 నెలలపాటు ఈ పదవిలో ఉండనున్నారు. 2027 ఫిబ్రవరి 9న సీజేఐ పదవీ విరమణ చేస్తారు.

# కోకాపేట కొత్త రికార్డ్

### ఎకరం రూ.151.25 కోట్లు.. గతవారం ఇదే లేఅవుట్‌లో రూ.137.25 కోట్లు పలికిన ధర



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని కోకాపేట భూములు ఈవేలంలో రికార్డు ధర పలికాయి. ఎకరం ధర ఏకంగా రూ.151.25 కోట్లకు చేరింది. ప్లాట్ నంబర్ 15, 16 కలిపి మొత్తం 9.06 ఎకరాల భూమికి వేలం నిర్వహించారు. 15వ నంబర్ ప్లాట్ (4.03 ఎకరాలు)లో ఎకరం రూ.151.25 కోట్లు, 16వ నంబర్ ప్లాట్ (5.03 ఎకరాలు)లో ఎకరానికి రూ.147.5 కోట్ల ధర లభించింది. తద్వారా సర్కారు ఖజానాకు రూ.1353 కోట్ల ఆదాయం సమకూరనుంది. హెచ్ఎండీఏ ఈవేలంలో ప్రారంభ ధరను రూ. 99 కోట్లుగా పేర్కొంది. 15వ నంబర్ ప్లాట్‌లో 4.03 ఎకరాల భూమిని లక్ష్మీనారాయణ కంపెనీ దక్కించుకోగా, ప్లాట్ నెం 16లోని 5.03 ఎకరాల భూమిని గోద్రేజ్ ప్రాపర్టీస్ సొంతం చేసుకుంది. కోకాపేట నియోపోలిస్‌లో హెచ్ఎండీఏ లేఅవుట్‌లో ప్లాట్ల భూముల వేలాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ నెల 24వ తేదీన ఇదే లేఅవుట్‌లోని 18వ ప్లాట్‌లో ఎకరా భూమి రూ.137.25 కోట్లుగా ధర పలికిన విషయం తెలిసిందే. 4 రోజుల వ్యవధిలోనే మరోసారి నిర్వహించిన ఈవేలంలో అదే లేఅవుట్‌లో ఎకరా ధర రూ.14 కోట్లు అధికంగా 151.25 కోట్లుగా పలకడం గమనార్హం.

**తీవ్ర పోటీతో.. ధర పెంచుకుంటూ వెళ్ళిన బిడ్డర్లు**

ఉదయం 11 గంటలకు ప్రారంభమైన వేలం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. పోటీ ఉండటంతో బిడ్డర్లు భూమి ధరను పెంచుకుంటూ వెళ్లారు. చివరికి అత్యధిక ధర రూ.151.25 కోట్లు, రూ.147.5 కోట్లు వేసిన వాళ్లకు భూములు దక్కాయి. నియోపోలిస్‌లోనే 19, 20 నంబరు ప్లాట్లలో మరో 8 ఎకరాల భూములకు వేలం నిర్వహించేందుకు హెచ్ఎండీఏ ఏర్పాట్లు సిద్ధం చేసింది. డిసెంబరు 3వ తేదీన ఈ రెండు ప్లాట్లలో ఉన్న భూములకు అధికారులు ఈ వేలం నిర్వహించనున్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు ప్రతి ప్లాటుకు కనీస ధరావతుగా రూ.5 కోట్లను చెల్లించాలి. ఒకవేళ అదృష్టం కొద్ది వేలంలో భూమిని దక్కించుకుంటే ఏడు రోజుల్లో ధరావతు మొత్తం పోను అమ్మకం విలువలో రూ.25 శాతం, తర్వాత 60 రోజుల్లో మిగతా సొమ్ము చెల్లిస్తే కొనుగోలుదారుల పేరుతో భూమిని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు హెచ్ఎండీఏ అధికార వర్గాలు పేర్కొన్నాయి.

**ప్రభుత్వం ప్రారంభ ధర రూ.101 కోట్లు**

హెచ్ఎండీఏ పరిధిలోని ఖరీదైన భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయడానికి ఇటీవల ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసింది. ఆగస్టు నెలలో రాయదుర్గంలోని 7.67 ఎకరాలకు టీజీఐఐసీ (తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) నిర్వహించిన వేలంపాటలో రూ.1,357 కోట్లకు ఓ సంస్థ దక్కించుకుంది. ఇక్కడ ఎకరం కనీస ధర రూ.101 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించగా వేలంలో ఏకంగా రూ.177 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో తాజాగా కోకాపేట నియోపోలీస్‌లోని సర్వే నంబరు 239, 240లో 16 నుంచి 19 ప్లాట్లు కలిపి మొత్తం 27 ఎకరాలను సర్కారు వేలానికి పెట్టింది. ఈ సారి ఎకరం రూ.150 కోట్లకుపైనే పలుకుతుందని భావించిన వారి అంచనాలు నిజమయ్యాయి.



## రాజీనామా చేస్తానన్న టీడీపీ ఎమ్మెల్యే

### నేరుగా హైకమాండ్ కు అల్టిమేటం

**అమరావతి, మహా:** నెల్లూరు జిల్లా లో గూడూరు నియోజకవర్గం ను కలపాల్సిందేనని, తిరుపతి నుండి తొలగించాలని టీడీపీ ఎమ్మెల్యే పాశం సునీల్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కు అనేక సార్లు చెప్పానని, త్వరలో నిర్ణయం తీసుకోకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుండి వైదొలుగుతునానన్నారు. గూడూరు ప్రజలు సమస్యలు విన్నవించాలంటే 90కిలోమీటర్లు జర్నీ చేయాల్సి వస్తోందన్నారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు.



## హాంకాంగ్ అగ్నిప్రమాదం

### 128కి పెరిగిన మృతుల సంఖ్య

**హైదరాబాద్, మహా :** హాంకాంగ్‌లోని బహుళ అంతస్తుల భవనాల్లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటి వరకు మొత్తం 128 మరణించారని, మరో 79 మంది తీవ్రంగా గాయపడ్డారని అధికారులు శుక్రవారం తెలిపారు. ఇంకా 200 మందికిపైగా బాధితుల ఆచూకీ దొరకలేదని పేర్కొన్నారు. హాంకాంగ్‌లోని 7 బహుళ అంతస్తుల భవనాల్లో బుధవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. వాస్తవానికి ప్రమాదానికి గురైన భవనాలు అన్నీ పక్కపక్కనే ఉన్నాయి. అందుకే మంటలు వెంటనే పక్కనున్న భవనాలకు వ్యాపించాయి. దీనితో రంగంలోకి దిగిన దాదాపు 1000 అగ్నిమాపక సిబ్బంది 24 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే ఇప్పటికీ కొన్ని భవనాల నుంచి పొగ వెలువడుతూనే ఉంది. అయితే చివరి ప్రయత్నంగా అధికారులు ఒక్కో అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేస్తున్నారు. పరిస్థితిని బట్టి మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

# ఉద్యోగులకు గుడ్ న్యూస్

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే ఏడాది పర్యటనలు, శుభకార్యాలు, ఇతర వ్యక్తిగత పనులను ప్లాన్ చేసుకునే వారికి ఈ క్యాలెండర్ ఎంతగానో ఉపయోగపడనుంది. విశేషమేమిటంటే, ప్రస్తుత సంవత్సరంతో పోలిస్తే 2026లో సెలవుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ కొత్త క్యాలెండర్ ప్రకారం మొత్తం 14 తప్పనిసరి సెలవులు ఉండగా, మరో 12 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయి. సంవత్సర ఆరంభం నుంచే పండుగ సందడి మొదలుకానుంది. జనవరి నెలలో 1వ తేదీన నూతన సంవత్సరం, 14న సంక్రాంతి, 23న వసంత పంచమి, 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సెలవులు ఖరారు చేశారు. ఇక ఫిబ్రవరి నెలలో 1న గురు రవిదాస్ జయంతి, 15న మహాశివరాత్రి, 19న ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సెలవులు ఉన్నాయి. మార్చి నెలలో పండుగలు అధికంగా ఉన్నాయి. మార్చి 4న హోలీ, 19న ఉగాది, 21న రంజాన్, 26న శ్రీరామ నవమి, 31న మహావీర్ జయంతి సందర్భంగా సెలవులు ప్రకటించారు. ఏప్రిల్‌లో 3న గుడ్ ఫ్రైడే, 5న ఈస్టర్, 14న అంబేద్కర్ జయంతి సెలవులు ఉండనున్నాయి. వేసవి మరియు వర్షాకాలం సెలవుల విషయానికి వస్తే, మే 1న బుద్ధ పౌర్ణమి, 9న రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, 27న బక్రీద్ సెలవులు ఉన్నాయి. జూన్ 26న మొహర్రం సెలవు ఇచ్చారు. ఆగస్టు నెలలో 15న స్వాతంత్ర దినోత్సవం, 26న మిలాద్ ఉన్ నబి మరియు ఓణం, 28న రక్షాబంధన్ సెలవులు ఖరారు చేశారు. సెప్టెంబర్ 4న కృష్ణాష్టమి, 14న వినాయక చవితి పండుగలు జరుపుకోనున్నారు. అక్టోబర్ నెలలో గాంధీ జయంతి (అక్టోబర్ 2)తో పాటు, 18, 19, 20 తేదీల్లో దసరా సెలవులు వరుసగా రావడం ఉద్యోగులకు కలిసొచ్చే అంశం. సంవత్సరాంతంలో వచ్చే పండుగలకు కూడా కేంద్రం స్పష్టమైన తేదీలను ప్రకటించింది. నవంబర్ 8న దీపావళి, 15న చట్ పూజ, 24న గురునానక్ జయంతి సెలవులు ఉన్నాయి. డిసెంబర్ 25న యధావిధిగా క్రిస్మస్ సెలవు ఉంటుంది. ఈ ప్రభుత్వ సెలవులతో పాటుగా ఏడాది మొత్తంలో 52 ఆదివారాలు, 12 రెండవ శనివారాలు కలిసి ఉన్నాయి. ఇవన్నీ కలుపుకుంటే విద్యార్థులకు దాదాపు 100 రోజులు సెలవులు వచ్చే అవకాశం ఉంది. పాఠశాలలకు దసరా, సంక్రాంతి సెలవులు అదనంగా పెరిగే అవకాశం ఉండటంతో వచ్చే ఏడాది విద్యార్థులకు, ఉద్యోగులకు పండుగ వాతావరణం నెలకొననుంది.

## కేసీఆర్‌ది బూటకపు డ్రామా

(మొదటిపేజీ తరువాయి)




శుక్రవారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ బూటకపు మాటలను నమ్మవద్దని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరుల శవాలపై కేసీఆర్ అధికారం అనుభవించారని.. 2009లో కేసీఆర్ చేసిన దీక్ష పూర్తిగా నాటకం అని ఆరోపించారు. తెలంగాణ వచ్చింది కేసీఆర్ దీక్ష వల్ల కాదని సోనియా గాంధీ వల్ల వచ్చిందన్నారు. 'రాష్ట్రం కోసం దీక్ష చేస్తున్నా' అని చెప్పి నిమ్స్‌లో ఫ్లూయిడ్స్ తీసుకున్నారని మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

**"నక్క – నాగలోకం" తేడా ఉంది..**

దీనికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, కేటీఆర్ ఒక్కసారి చదవాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళులు అర్పించాలని హితవు పలికారు. 2009లో ముగిసిన దీక్షతో బీఆర్ఎస్ నాటకాలకు తెరతీస్తోందని మండిపడ్డారు. నిజమైన దీక్షకు మయన్మార్ ఐరన్ లేడీ ఇరోమ్ షర్మిలా 16 ఏళ్ల నిరాహార దీక్షే ఉదాహరణ అని.. షర్మిల దీక్షకు కేసీఆర్ దీక్షకు "నక్క - నాగలోకం" తేడా ఉందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల మాదిరిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ గల్లంతు కావడం ఖాయం అని మహేశ్ గౌడ్ జోష్యం చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి అనేక వర్సిటీల విద్యార్థులు ఉద్యమానికి ఊపిరులుగా నిలిచారన్నారు. విద్యార్థుల ఆత్మబలిదానాలకు స్పందించి సోనియమ్మ తెలంగాణ ఇచ్చారని చెప్పుకొచ్చారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ప్రజా ప్రతినిధులను నిలదీయాలని ప్రజలకు మహేశ్ గౌడ్ పిలుపునిచ్చారు.



## భీమిని మండల కాంగ్రెస్ పార్టీలో చేరిక

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి నియోజకవర్గం భీమిని మండలంలోని బిఆర్ఎస్, భాజపా పార్టీల నుండి పలువురు కార్యకర్తలు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం నాడు సీనియర్ కాంగ్రెస్నాయకులు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరావు నర్సింగరావుల ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువకులు చేరడం జరిగింది. భీమిని మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు మాధవరపు నర్సింగరావుల సమక్షం లో గురువారం నాడు కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు.బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ బెల్లంపల్లి నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై చిన్నగుడిపేటకు చెందిన 100మంది బిజెపి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ భీమిని మండలాధ్యక్షుడుగాదం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వీరికి బెల్లంపల్లిమాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముదిగిరి కొమురయ్య,బొగ్గుల రమేష్, పుల్లూరి శేఖర్, కర్నే శ్రీనివాస్, వరి మడ్లమల్లేష్,బోరిగాంజలపతి,కొత్త కొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోనే నామినేషన్లు స్వీకరించాలి

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** నిర్ణీత గడువులోనే సంబంధిత అధికారులు నామినేషన్లు స్వీకరించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ, ముత్యంపేట, రెబ్బెనపల్లి, చెల్కగూడ గ్రామాలకు కొర్విచెల్మ గ్రామపంచాయతీ, నెల్కి వెంకటాపూర్, వందూర్ గూడ, చింతపల్లి, తానిమడుగు గ్రామాలకు నెల్కివెంకటాపూర్ గ్రామ పంచాయతీ, ద్వారక, కొండాపూర్, ధర్మారావుపేట గ్రామాలకు ద్వారక గ్రామపంచాయతీ, మ్యాదరిపేట, మామిడిపల్లి, కొత్త మామిడిపల్లి గ్రామాలకు మ్యాదరిపేట గ్రామపంచాయతీ, దండేపల్లి, కర్ణపేట, నర్సాపూర్ గ్రామాలకు దండేపల్లి గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు చేపట్టిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 29 నాడు సాయంత్రం 5 గంటల లోగా నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని అన్నారు. 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని తెలిపారు. నామినేషన్ కేంద్రంలో రద్దీ లేకుండా నామినేషన్ స్వీకరణ ప్రక్రియ నిబంధనలకు లోబడి త్వరగా పూర్తి చేయాలని ఆయన వెల్లడించారు. జిల్లాలో 3 విడతలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా మొదటి విడతలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించకూడదని, నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం మండలంలోని ద్వారక గ్రామంలో కొనసాగుతున్న షెడ్యూల్డ్ తెగల బాలుర సంక్షేమ వసతిగృహం నిర్మాణ పనులను సందర్శించి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతకుముందు లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు టార్పాలిన్లు, గోనె సంచులు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. దొడ్డు రకం, సన్న రకం ధాన్యాలను వేరువేరుగా కొనుగోలు చేయాలని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు సమయంలో రైతుల వివరాలు, ధాన్యం వివరాలను సేకరించి ట్యాబ్ లలో నమోదు చేయాలని, సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 77 అడుగుల రాముడు

**గోవాలో ప్రపంచంలోనే ఎత్తయిన విగ్రహం**

**ఆవిష్కరించిన ప్రధాని మోదీ**

(మొదటిపేజీ తరువాయి)

ఈ మఠం భారతదేశంలోనే అతి పురాతన మత సంస్థల్లో ఒకటిగా ప్రాచుర్యం పొందింది. ఇది 13వ శతాబ్దంలో జగద్గురు మధ్వాచార్య స్థాపించిన ద్వైతాన్ని అనుసరిస్తుంది. కాగా, గుజరాత్‌లో ఉన్న 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని తీర్చిదిద్దిన శిల్పి రామ్ సుతార్ ఈ 77 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని కూడా తయారుచేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంతో పాటు వారణాసిలో కాశీ విశ్వనాథ్ ధామ్, ఉజ్జయిన్ మహాకాల్ పునర్‌అభివృద్ధితో భారత ఆధ్యాత్మిక వారసత్వానికి బలం చేకూరింది. కొత్త సంకల్పాలు, విశ్వాసంతో భారత్ సాంస్కృతిక గుర్తింపును ముందుకు తీసుకువెళుతోంది. యుగాలు మారాయి. కాలాలు గడిచాయి. దేశం, సమాజం ఎన్నో మార్పులను చూసింది. కానీ ఎన్ని యుగాలు, కాలాలు మారినా ఈ మఠం మాత్రం తన లక్ష్యాన్ని మర్చిపోలేదు. ఇది ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచే గొప్ప కేంద్రంగా మారింది. ఐక్యతతోనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటాం. సమాజం, ప్రాంతం, అన్ని వర్గాల ప్రజల కలిసి వచ్చి ఐక్యంగా ఉన్నప్పుడు దేశం ఉన్నత స్థానానికి చేరుకుంటుంది. అభివృద్ధి చెందిన భారత్‌లో మఠం పాత్ర చాలా కీలకమైనది. అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.



## పూలే సమాజ శ్రేయస్సు కొరకు సర్వస్వం దార పోశాడు

**వి.హెచ్.పి.ఎస్, బహుజన సమాజ్ పార్టీల నేతలు**

**మంచిర్యాల, మహా :** మహాత్మ జ్యోతిరావు పూలే భారత సమాజ శ్రేయస్సు కొరకు సర్వస్వం దార పోశాడని వి.హెచ్.పి.ఎస్, బహుజన సమాజ్ పార్టీల నేతలు అన్నారు. గురువారం మంచిర్యాల, మందమర్రి, తదితర ప్రాంతాలలో బీసీల నేతలు వేరువేరుగా కూడా జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి సత్యనారాయణ, దాగం శ్రీనివాస్ లు మాట్లాడుతూ బడుగు బలహీనుల హక్కుల సాధన కొరకు విద్య వృద్ధి కొరకు పూలే ఎంతగానో శ్రమించారని చెప్పారు. సమాజంలో కుల వివక్షత, అంటరానితనం అసమానతలు తొలగిపోయి మనుషులంతా సమానంగా జీవించాలని మొట్టమొదటిసారిగా తిరుగుబాటు బహుట ఎగురవేసిన మహోన్నత నేత పూలే అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో సొత్కు సుదర్శన్, నోముల ఉపేందర్ గౌడ్, ముల్కాల రాజేంద్రప్రసాద్, నాగుల కిరణ్ బాబు, గాజుల శంకర్, రహీం బాబా, తాటిపల్లి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



## చెక్ పోస్ట్ ల వద్ద పటిష్ఠ నిఘా

**భువనగిరి, మహా:** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా లో చెక్ పోస్ట్ ల వద్ద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు చెప్పారు... శుక్రవారం బీబీనగర్ టోల్ గేట్ వద్ద గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ఎస్ ఎస్ టి టీం చెక్ పోస్ట్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. చెక్ పోస్ట్ వద్ద ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.24 గంటలు చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహించాలని అన్నారు.పోలీస్, రెవిన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని ఆపి వీడియో రికార్డ్ చేస్తూ క్షుణ్ణంగా తనిఖీ చేయాలి అన్నారు.ఎట్టి పరిస్థితుల్లో విధుల్లో నిర్లక్ష్యం చేయడానికి వీలులేదని అన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతి రావ్ పూలే వర్ధంతి

**భువనగిరి, మహా:** బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి,మహిళల విద్యా అభివృద్ధికి కృషి చేసిన బహుజన మహానుభావుడు మహాత్మా జ్యోతి రావ్ పూలే వర్ధంతి నేడు భువనగిరిలో ఘనంగా నిర్వహించారు... పట్టణంలోని జగదేవ్ పూర్ చౌరస్తా వద్దగల మహాత్మా జ్యోతి రావ్ పూలే విగ్రహానికి బిసి,ఎస్ సి,మైనార్టి నాయకులు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తంగల్లపల్లి రవి కుమార్, దళిత నాయకులు బట్టు రాంచెంద్రయ్య, పులిగిల్ల బాలయ్య,నర్సింగా రావు, ఓబిసి నాయకులు బెండ శ్రీకాంత్,రఘునాంధన్,శివకుమార్, బలరాం, మాజీ కౌన్సిలర్ సలాహుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జుకూరి చైతన్య రాజు వర్మ



**ఎల్బీనగర్,మహా:** మన్సూరాబాద్ డివిజన్ ప్రసిద్ది హాస్పిటల్ ఎండీ జుకూరి చైతన్య రాజు వర్మకు ఉన్నతస్థానం లభించింది. టీ పీసీసీ మెడికల్ అండ్ హెల్త్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో పాటు ఆర్గనైజెషన్ ఇన్ చార్జి బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం గాంధీ భవన్ లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజీవ్ ఉత్తర్వులు అందజేశారు. గాంధీ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.రాజీవ్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ చేతులు మీదుగా జుకూరి చైతన్య రాజు వర్మ నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజా ఆరోగ్య వ్యవస్థను శక్తివంతం చేయడానికి, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను బలోపేతం చేయడానికి చైతన్య రాజు వర్మ సేవలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. చైతన్య రాజు వర్మ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానన్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ప్రతి ఇంటికి ఆరోగ్య అవగాహన చేరవేయడం తన ముఖ్య ధ్యేయమని తెలిపారు. వైద్య శిబిరాలు, ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజా సేవలకు తాను నిరంతరం కృషి చేస్తానన్నారు.



## ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

**బీబీనగర్, మహా:** గ్రామపంచాయతీ ఎన్నికల విధుల పట్ల ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో పిఓ, ఓ.పి.ఓ ల శిక్షణ తరగతులలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర చాలా కీలకమైనదన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు సజావుగా జరిగేలా చూసుకోవడంలో ప్రిసైడింగ్ అధికారుల బాధ్యత ఉందన్నారు .ఎన్నికల విధులకు వేసిన ప్రతి ఒక్కరు విధుల్లో చేరాలని ఎవ్వరికీ కూడా మినహాయింపు ఉండదన్నారు. పోలింగ్ సామగ్రిని ప్రతి ఒక్కటి క్షుణ్ణంగా పరిశీలించి బాలెట్ పేపర్స్, పోలింగ్ బాక్సులు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా పోలింగ్ బాక్స్ ఓపెన్ చేయడం ,సీల్ వేయడం చాలా ముఖ్యమైన అంశం కాబట్టి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం నిక్ష్పాక్షకంగా ఉండాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పి.ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ అక్రమాలపై సీఎం సీరియస్

(మొదటిపేజీ తరువాయి)

కాగా, వైద్య విద్య పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాలు, సీట్ల కేటాయింపు వరకు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నందకుమార్ రాజీనామా చేశారు. పేపర్ల మూల్యాంకనంలో అవకతవకలతో పాటు ఇన్‌చార్జీల నియామకంలో ఆరోపణలు రావడంతో శుక్రవారం సాయంత్రం రాజీనామా చేశారు. సీఎం ఆగ్రహం వ్యక్తం చేసిన కొద్దిసేపటికే ఆయన రాజీనామా చేశారు.



## డిసెంబర్ 4న సీఎం ఆదిలాబాద్ పర్యటన

**ఆదిలాబాద్ మహా :** డిసెంబర్ 1నుండి తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఉండనుందన్న సమాచారంతో ఆదిలాబాద్ జిల్లాలో అధికారులు అలర్టయ్యారు. డిసెంబర్ నాలుగున ముఖ్యమంత్రి ఆదిలాబాద్ పర్యటన ఖరారు కావడంతో ఏర్పాట్లు మొదలు పెట్టారు, శుక్రవారం స్థానిక ఏరోడ్రమ్ పరిసరాలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేసారు. సీయం రోజుకు రెండు నియోజక వర్గాలు పర్యటించేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారని సమాచారం.

## సీఎంతో పీసీసీ చీఫ్ భేటీ

**పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కీలకచర్చ**

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ప్రజాపాలన వారోత్సవాలు విజయవంతం పై ప్రధానంగా ఇరువురు నేతలు చర్చించారు. డిసెంబర్ 2న నూతన డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించే అవకాశం కనబడుతోంది. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరగబోయే ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు పాల్గొంటారు.



## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**ఆదిలాబాద్ మహా:** మున్సిపల్ స్థలంలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని మున్సిపల్ కమీషనర్ సీవీఎన్ రాజు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ లో మున్సిపల్ ఓపెన్ ప్లేస్ లో అక్రమంగా కట్టిన కట్టడాలను సిబ్బందితో కలిసి తొలగించారు.ఇకముందు ఇలాంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

**ఎల్బీనగర్, చైతన్యపురి డివిజన్లలో విషాదం**

**ఎల్బీనగర్,మహా :** ఎల్బీనగర్ నియోజకవర్గంలో శుక్రవారం వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారు. చైతన్యపురి, ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం నెలకొంది. ఇంట్లో వారి ఒత్తిడి భరించలేక ఒకరు, ఫ్యాకల్టీ ఒత్తిడి భరించలేక మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో.... తన మరణానికి ఎవరూ బాధ్యులు కారని, ఐ సారీ మమ్మి, డాడి, చెల్లి.. నా వల్ల అవడం లేదు... అని సూసైడ్ లెటర్ రాసి బీటెక్ విద్యార్థి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మాన్సురాబాద్ డివిజన్ బాలాజీనగర్ లో నివాసం ఇంటి సుధాకర్, జ్యోతి భార్యభర్తలు, జ్యోతి కామినేని హాస్పిటల్లో స్టాఫ్ నర్స్ గా పనిచేసుంది. సుధాకర్ వనస్థలిపురంలోని ఒక చర్చిలో పాస్టర్ గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె దివ్య(20) కూకట్ పల్లిలోని జేఎన్టీయూలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతుంది. అక్కడే హాస్టల్ లో ఉంటుంది. ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటలకు దివ్య ఇంటికి వచ్చి తనకు కాళ్ల నొప్పి ఉందని తల్లికి చెప్పింది. గురువారం సాయంత్రం 4 గంటలకు దివ్య ఫ్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఈ మేరకు దివ్య తల్లి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బెడ్ రూమ్ పరిశీలించగా, సూసైడ్ లెటర్ దొరికింది. ఈ లెటర్ లో తన మరణానికి ఎవరూ భాధ్యులు కారని ఐ యాం సారీ.. డాడీ, మమ్మీ, చెల్లి.. అని రాసింది. జేఎన్టీయూ కళాశాల ఫ్యాకల్టీ పెట్టిన ఇబ్బందులు, వేధింపులతోను దివ్య ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వినోద్ కుమార్ తెలిపారు.

### చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో...

కొత్తపేట డివిజన్ మార్గదర్శి కాలనీలో వి.మహేశ్వరి(17) ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇటీవల ఇంటర్ పూర్తి చేసి ఎలాంటి పని చేయడం లేదని తల్లిదండ్రులు మందలించిన కారణంగా మహేశ్వరి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తు న్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదులు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏర్పుల వెంకటేశంను గెలిపించండి

**పులిపలుపుల రాములు**



**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధిలోని వేములకొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏర్పుల వెంకటేశం ను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిపలుపుల రాములు అన్నారు ఆయన శుక్రవారం మహా న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏర్పుల వెంకటేశం ను పార్టీలకు అతీతంగా మంచి మనసున్న అందరితో కలిసిమెలిసి ఉండే వెంకటేశంను గెలిపించి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి తోడ్పడుదామని ఆయన అన్నారు

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్సై యుగంధర్ గౌడ్




**వలిగొండ, మహా :** సర్పంచ్ ఎన్నికల దృశ్య వలిగొండ మండల పరిధిలోని అరూరు చిత్తాపురం వేములకొండ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎస్ఐ యుగేందర్ గౌడ్ సందర్శించారు సర్పంచ్ ఎన్నికలను అన్ని గ్రామాలలోని ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని ఎన్నికల నిబంధనలను ఎవరు ధిక్కరించిన చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు

# ఉత్సాహంగా నామినేషన్‌లు






**నిర్మల్ మహా:** పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత లో జరిగే గ్రామ పంచాయితీలకు నామినేషన్ల ఘట్టం కొనసాగుతోంది. గురువారం తొలి రోజు అంతంత మాత్రంగా ఉన్నా రెండో రోజు మాత్రం ఊపందుకున్నాయి. నిర్మల్ జిల్లాలో తొలి విడతలో ఎన్నికలు జరిగే దస్తూరాబాద్, కడెం పెద్దూర్, ఖానాపూర్, పెంబి ,మామడ,లక్ష్మణచాందా మండలాలలోని 136 గ్రామ పంచాయితీల సర్పంచ్ లు,1072 వార్డ్ మెంబర్ల కోసం నామినేషన్లు స్వీకరిస్తున్నారు.రెండు రోజులకు కలిపి సర్పంచ్ పదవికి 277 మంది అభ్యర్థులు, వార్డ్ మెంబర్లకు 302 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. నేడు శనివారం చివరి రోజు కావడంతో మరిన్ని పెద్ద సంఖ్యలో దాఖలయ్యే అవకాశముంది.అయితే కొన్ని చోట్ల ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తున్నట్టుగా తెలుస్తోంది.ముందస్తు ఏకగ్రీవాలు చెల్లవని ఖచ్చితంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగి, పరిశీలన, ఉపసంహణ అనంతరం ఒక్కరు అభ్యర్థే మిగిలితే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటిస్తామని అధికారులు చెబుతున్నారు.



**శిక్షణ కార్యక్రమాలకు హాజరుకాని వారు**

## 24 గంటలలో రిపోర్ట్ చేయాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి, మహా:** శుక్రవారం నాడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల శిక్షణ కార్యక్రమాలకు హాజరుకాని ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ అధికారులు 24 గంటల లోపు రిపోర్ట్ చేయాలని లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలలో భాగంగా షోకాజ్, సస్పెండ్ చేయడం జరుగుతుందని యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పిఓలకు, ఓపిఓలకు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని కాని విధులు కేటాయించినా, శిక్షణ తరగతులకు గైర్హాజరైన అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.



## కాంగ్రెస్ లో చేరిన గుర్రాల లక్ష్మరెడ్డి

**బొమ్మలరామారం, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి శుక్రవారం భారీగా చేరికలు జరిగాయి. యాదగిరిగుట్టలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే,,డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య సమక్షంలో బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన గుర్రాల లక్ష్మ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి చేరారు.. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య కాంగ్రెస్ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు....

**IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE - Cum- III ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: AT: MALKAJGIRI**
**O.S.NO. 882 OF 2023**

Between:
**CANARA BANK** {Previously known as Syndicate Bank} Malkajgiri Branch, Hyderabad Represented by its Branch Manager: Manjusha Kasturi W/o. M.Dilip, aged about 39 years, R/o. Hyderabad ... Plaintiff

**A N D**

**A. Venkata Lakshmi,** Prop.Sri Satyamamba Ladies Tailors, D.No.26-122-26-52-A, Sarada Nagar, Safilguda, Hyderabad-500047 Telangana ....Defandant

Please take notice that the above named plaintiff filed O.S. No. 882 of 2023 for passing of a decree for recovery of **Rs.2,35,876.38** (Rupees Two Lakhs thirty five eight Hundred seventy six rupees thirty eight paisa only) against you before the above said Hon'ble Court. The said case is posted to **15-12-2025** you shall appear before the above said court at 10:30 A.M. on **15-12-2025** either in person or through an advocate. Otherwise the matter will be heard and decided as per law.

**( By the order of the Honble Court )**

Sd/- **Malladi Surya Prakash,** Advocate, H.No.6-257/A, Sunshine Colony, Dammaiguda Keesara Mandal, Medchal Malkajgiri District, 500083, Telangana.

# మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?

జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం

## ANN SCHOOL OF JOURNALISMలో

జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.

## గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఇదే మా ఆహ్వానం



## అతి త్వరలో 2వ బ్యాచ్ ప్రారంభం

LIMITED TIME HURRY UP! LIMITED TIME

## త్వరపడండి...

**పరిమితమైన సీట్లు,**
సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన

**మీరున్న చోటు నుండే**
ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు

**8 వారాలు,**
**16 ఆన్‌లైన్ క్లాసులు**

కోర్సు పూర్తైన విద్యార్థులకు
**జర్నలిజం సర్టిఫికెట్**
ఇవ్వబడును

మెరిట్ స్టూడెంట్స్ కు
ఇంటర్న్ షిప్ అవకాశం..
రికమండేషన్ లెటర్

**FOR ADMISSIONS CONTACT: +91 7436939999**

SCAN ME

**APPLY ON OUR OFFICIAL WEBSITE:**

**WWW.ANNSCHOOLOFJOURNALISM.COM**

## విద్యావేత్తగా దాతృత్వం చాటుకున్న గంట రవికుమార్



**వరంగల్ మహా;** కన్న తల్లిదండ్రులను, పుట్టిన ఊరిని మరిచి పోవద్దని, అదేవిధంగా చదువుకున్న బడికి ఎంత చేసిన తక్కువే అనే సిద్ధాంతాన్ని నమ్ముకున్న వ్యక్తి గంట రవికుమార్. విద్యావేత్తగా దాతృత్వం చాటుకున్న గంట రవికుమార్ 2020 సంవత్సరంలో ఏవివి కళాశాలలో ప్లాటినం బ్లాక్ నూతన భవనంలో తరగతి గదులు నిర్మించడానికి తన వంతు సహాయంగా 5 లక్షలు విరాళంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం వరంగల్ ఏవివి కళాశాల ప్లాటినం బ్లాక్ భవనం పూర్తయి తరగతి గది ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సత్యం కంప్యూటర్స్ వ్యవస్థాపకులు గంట రవికుమార్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గంట రవి మాట్లాడుతూ ఆచార్య చంద్ర కాంతయ్య తన దాతృత్వ గుణానికి ప్రసిద్ధి చెందారని ఆయన దానకర్ణుడు అని పిలువబడ్డారు. విద్య తో పాటు సామాజిక సేవా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక భక్తి వేదాంత జ్ఞాన కార్యక్రమాల ద్వారా తెలంగాణ సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశారని కొనియాడారు. నిజాం ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి 'దర్జే అవ్వల్' అనే బిరుదుతో సత్కరించిందని 'వైశ్యరత్న' అనే బిరుదు కూడా ఆయనను వరించిందని ఆయా సంస్థలు వరంగల్ లోని చందా కాంతయ్య మెమోరియల్ సీకేం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆయన పేరు మీదే స్థాపించ బడిందని ఇది ఆయన విద్యాభివృద్ధికి చేసిన కృషికి నిదర్శనం అని సికేం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి కూడా ఆయన పేరు మీదే వెలసిందంటె సమాజానికి ఆయన చేసిన సేవలు ఎంత గొప్పవో తెలుస్తుందని గంట రవికుమార్ అన్నారు. ఇలాంటి కార్యక్రమంలో నేను కూడా ఒక భాగస్వామిని కావడం నా అదృష్టంగా భావిస్తున్నానని సంతోషం వ్యక్తం చేశారు.

## పూలే విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే , కుడా చైర్మన్



**హన్మకొండ మహా;** మహాత్మా జ్యోతి భా పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పూలే చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ములుగు రోడ్డు లో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే చూపిన సమానత్వం, న్యాయం, విద్యా హక్కుల మార్గం నేటికీ సమకాలీన మేనని యువత సమాజం ముందుకు వెళ్లాలంటే విద్యే ఏకైక సాధనమని పూలే ఇచ్చిన సందేశాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. పూలే సిద్ధాంతాలు అందరికీ ప్రేరణగా ఉండాలని, ఆ విలువలను ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల ద్వారా బల పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు,జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## వరద బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన ప్రభుత్వం

- బాధిత కుటుంబాలకు రేషన్ బియ్యం పంపిణీ
- ఎమ్మెల్యే నాయిని , మేయర్, కుడా చైర్మన్



**హన్మకొండ మహా;** నవంబర్ నెలలో వచ్చిన అకాల వర్షాల కారణంగా సర్వం కోల్పోయిన వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలలో భాగంగా శుక్రవారం హన్మకొండ, కాజీపేట మండలాల్లోని వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పించిన రేషన్ ను, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తో కలిసి బాధిత కుటుంబాలకు అందజేశారు. రెండు మండలాలకు గాను మొత్తం 57 వ డివిజన్ వాజ్ పేయ్ కాలనీ తో పాటు 49 డివిజన్ లోటస్ కాలనీల్లో పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలతో నగరంలో చాలా చోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలను మరుసటి రోజే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి సంబంధిత మంత్రులు, అధికారులు పర్యటన చేసి జరిగిన నష్టాన్ని అంచనావేసి వరద సహాయం కింద రూ 15000 ప్రకటించారని గుర్తు చేశారు. కాగా బాదిత కుటుంబాలకు చెందిన బ్యాంకు ఖాతాల నెంబర్లు తప్పుగా ఇవ్వడం వల్ల ఆలస్యం అయిందని ఒక్కొక్కటిగా బ్యాంకు ఖాతాలో నగదు బదిలీ సోమవారం నాటికి పూర్తి అవుతుందని తెలిపారు. 2440 మందికి నష్ట పరిహారంగా రూ.3.76 కోట్లు రూపాయల తో పాటు బాధిత కుటుంబాలకు 504 క్వింటాళ్ల రేషన్ బియ్యం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రవర్తన నియమావలి పక్కాగా అమలు కావాలి

**జిల్లా ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్ ఐఎఫ్ఎస్**



**జనగామ మహా;** జనగామ జిల్లాకు విచ్చేసిన ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్ కు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ మొక్కలను అందించి స్వాగతం పలికారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు ఉండాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు రవి కిరణ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రవి కిరణ్, ఎన్నికల పరిశీలకులు, కమిషనర్, మీసేవ విచ్చేసి కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీపీ, నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో మూడు దశల్లో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు,బ్యాలట్ బాక్సు్లు, రవాణా, జోన్లు, రూట్, అన్ని అంశాల్లో పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్నికలు పూర్తిస్థాయి పారదర్శకతతో జరగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. అనంతరం అబ్జర్వర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా పాటించాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీ ఒక్కరు శిక్షణ పూర్తి చేసుకొని ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సందేహాలు ఉన్న వెంటనే నివృత్తి చేసుకువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మాధురి షా, ఇంచార్జి డీపీవో, డి ఆర్డీ ఓ వసంత, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్స్, మెటీరియల్, ట్రాన్స్పోర్ట్, తదితర అంశాల నోడల్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం రఘునాథ్ పల్లి, నీడిగొండ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని కలెక్టర్ తో కలిసి అబ్జార్వర్ సందర్శించి నామినేషన్ ప్రక్రియ ను పరిశీలించారు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా సజావుగా నిర్వహించాలన్నారు. ఆయా పంచాయతీల కు ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారం సంబంధిత వర్గాల అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, వార్డు సభ్యులు పదవులకు పోటీ చేయు అభ్యర్థులు తమ దరఖాస్తుకు జతపరచాల్సిన వయసు, కుల, ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం స్వీకరించాలన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ దాఖలు..



**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కట్కూరి కోటేశ్వర్ గౌడ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పాలమాకుల గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. శంషాబాద్ మండలంలో అత్యధిక మెజార్టీ తో జననేత కట్కూరి కోటేశ్వర్ గౌడ్ ను ప్రజల అండదండలతో పాలమాకుల గ్రామ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

# గ్రేటర్ వరంగల్ ను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

**నగర మేయర్ గుండు సుధారాణి.. ప్లాస్టిక్ పై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేసిన మేయర్**




**వరంగల్, మహా;** హనుమకొండ లోని బాల సముద్రం ఎల్ ఐ సి మార్కెట్ ను పర్యావరణ హిత మార్కెట్ గా తీర్చిదిద్దాలని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయ పడ్డారు. శుక్రవారం బల్దియా శానిటేషన్ విభాగం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన కార్యక్రమానికి నగర మేయర్ ముఖ్య అతిథి గా హాజరై ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలను తెలియజేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ బాల సముద్రం మార్కెట్ ను ప్లాస్టిక్ రహిత మార్కెట్ గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఇందుకోసం మార్కెట్ లో వ్యాపారాలు నిర్వహించుకునే ప్రతి ఒక్కరూ తన వంతు బాధ్యత గా సహకరించాలని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల అనేక రకాల అనర్థాలకు కారణ భూతం అవుతుందని ప్లాస్టిక్ భూమిలో కలిసి పోకుండా రసాయనాలను విడుదల చేయడం వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని అన్నారు. తద్వారా కాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని అందువల్ల ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలని, తారతమ్యాలు లేకుండా మార్కెట్ లో కూరగాయలు కొనుగోలు చేయడానికి అన్ని వర్గాల వారు వస్తారని, కూరగాయల వ్యాపారాలు నిర్వహించేవారు తమ వద్దకు కొనుగోళ్లకు వచ్చే ప్రజలకు ప్లాస్టిక్ గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా వినియోగం లో ఉన్న బయో డిగ్రేబుల్, బట్ట, కాగితపు, జూట్ సంచులను వినియోగించేలా ప్రోత్సహించాలని సూచించారు. మన జీవన సరళి మార్చుకోవడం లో భాగంగా పర్యావరణాన్ని సంరక్షించి భావి తరాలకు కాలుష్య రహిత జీవనాన్ని పొందేలా చూడాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పై ఉందని మేయర్ అన్నారు. అనంతరం మార్కెట్ లో గల పలు దుకాణదారులకు ప్లాస్టిక్ వల్ల కలిగి అనర్థాలను తెలియజేసే కరపత్రాలను మేయర్ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలోసి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఈఈ రవి కుమార్, డి ఈ రాగి శ్రీకాంత్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి
- విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కోనాయమాకుల క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయం లో ఏర్పాటు చేస్తున్న గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో 2వ విడతలో ఈనెల 30వ తేదీ నుండి జరగనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నికల సందర్భంగా క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలలో నామినేషన్ల స్వీకరణ కు చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి వాటి ఏర్పాట్ల గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాలలో నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్న నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ వేసే అభ్యర్థుల కోసం హెల్ప్ డెస్క్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాలను రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గీసుకొండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాన్ని కలెక్టర్ బోధించగా విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. తదనంతరం సంగెం మండలం పల్లార్ గూడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సిబ్బంది సమన్వయం, ప్రజా సౌకర్యాల మెరుగుదలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడానికి ఇష్టపడి చదవి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారిని ప్రోత్సాహించారు. క్రమశిక్షణ, కష్టపడి చదివే ధోరణి, విజ్ఞానపరమైన ఆసక్తి ప్రతి విద్యార్థిని ముందుకు తీసుకెళ్తాయని ఆమె సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పి సీఈవో రామ్ రెడ్డి, సంగెం తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపీడీవో రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో రెండో రోజు సర్పంచ్ స్థానాలకు పోటా పోటీ

**84 వార్డు స్థానాలకు 230 నామినేషన్ల స్వీకరణ**

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లాలోని మూడు మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థులు పోటాపోటీ పడ్డారు. అభ్యర్థుల నుండి అధికారులు నామినేషన్ పత్రాలను రెండో రోజు శుక్రవారం స్వీకరించారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో శుక్రవారం క్లస్టర్ల పరిధిలోని గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు 84, వార్డు స్థానాలకు 230 నామినేషన్ పత్రాలను రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు అభ్యర్థులు శుక్రవారం సమర్పించారు. భీమదేవరపల్లి మండలం లోని గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు 37 నామినేషన్లు, వార్డు స్థానాలకు 100 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎల్కతుర్తి మండలంలో సర్పంచ్ స్థానాలకు 22 నామినేషన్లు, 53 వార్డు స్థానాలకు నామినేషన్లు వేశారు. కమలాపూర్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 25 నామినేషన్లు , వార్డు స్థానాలకు 77 నామినేషన్లను అభ్యర్థుల నుండి అధికారులు స్వీకరించారు. భీమదేవరపల్లి లోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, తహసిల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశంలతో కలిసి సందర్శించారు. నామినేషన్ల ప్రక్రియను గురించి అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కమలాపూర్ మండలంలోని గూడూరు క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి, తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో గుండె బాబు సందర్శించి నామినేషన్లను గురించి అడిగి తెలుసుకున్నారు. కమలాపూర్ లోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు దేవేందర్ సందర్శించారు. ఇప్పటివరకు (గురు, శుక్రవారాలు కలిపి) రెండూ రోజుల్లో భీమదేవరపల్లి మండలానికి సంబంధించి సర్పంచ్ స్థానాలకు 67 నామినేషన్లు, వార్డు స్థానాలకు 122 నామినేషన్లు వచ్చాయి. ఎల్కతుర్తి మండలంలో సర్పంచ్ స్థానాలకు 42, వార్డు స్థానాలకు 58 నామినేషన్లు దాఖలయ్యాయి. కమలాపూర్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 61, వార్డు స్థానాలకు 111 నామినేషన్లు సమర్పించారు. ఈ మూడు మండలాలకు సంబంధించి ఇప్పటివరకు సర్పంచ్ స్థానాలకు 170, వార్డులకు 291 నామినేషన్లు దాఖలయ్యాయి.

## భక్తుల అంచనా మేరకు మేడారం అభివృద్ధి



- **ఆదివాసీ ఆచారాలు, ఆధ్యాత్మికతతో ఆలయ నిర్మాణం**
- **మేడారం సమ్మక్క జాతర పనులను మంత్రులు పొంగులేటి, సీతక్కతో పరిశీలించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**వరంగల్ మహా;** ఆసియా ఖండంలోనే అతి ఆదివాసీ, గిరిజన జాతర అయిన మేడారం, భక్తుల సంఖ్య అంచనా మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రతి నిర్మాణంలో ఆదివాసీ, గిరిజన, కోయ ఆచారాలు, ఆధ్యాత్మిక చింతన ప్రస్ఫుటించాలని స్పష్టం చేశారు. శుక్రవారం వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయితీరాజ్ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్ తదితర అధికారులతో కలిసి ఆలయ సంబంధిత నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని మేడారంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఆలయ నిర్మాణ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆదివాసీ ఇలవేల్పులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణ పనులు, డివైడర్లు, ప్లాంటేషన్ తదితర పనులు పూర్తి కావడానికి 24 గంటలు నిరంతరం పని చేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. గద్దెల దర్శనం, బంగారం (బెల్లం) సమర్పణ... జంపన్న వాగులో స్నానాలు ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రధానంగా గుడి ప్రాంగణంలో చేస్తున్న అభివృద్ధి పనులను, జంపన్న వాగు, స్తూపం నుండి బస్టాండ్ వరకు జరిగే రోడ్ల విస్తరణను ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులతో పరిశీలించారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బి ఈ ఎన్సీ మోహన్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, రాష్ట్ర నాయకులు మనోజ్ కుమార్, మండల మాజీ అధ్యక్షులు జాలపు అనంత రెడ్డి, జిల్లా నాయకులు, మండల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థులకు బ్యాంకర్లు సహకరించాలి

- అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- బ్యాంకుల రుణాల పురోగతి పై సమీక్షా సమావేశం




**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి డిసిసి కమిటీ, జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈవో ఇంచార్జ్, ఆర్ డి ఓ రాంరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలీ రాజు, యూనియన్ బ్యాంక్ డీజీఎం కమలాకర్, ఆర్.బి.ఐ అధికారి చేతన్, తో పాటు జిల్లాలోని 33 బ్యాంక్ అధికారులు సమీక్ష కు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయం, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాలు, మహిళల స్వయం సహాయక సంఘాలు, ప్రైయారిటీ సెక్టార్‌లో బ్యాంకుల రుణాల పురోగతిపై సమగ్ర సమీక్ష చేశారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి బ్యాంకు శాఖ పనితీరు మెరుగుపర్చాలని, అర్హులైన లబ్ధిదారులకు సమయానికి రుణాలు అందించాల్సిందిగా బ్యాంకు అధికారులను ఆదేశించారు. బ్యాంక్ అధికారుల లక్ష్యసాధన నివేదికలు సరిగా సమర్పించ నందున ఈ సమావేశాన్ని డిసెంబర్ 9 తేదీకు వాయిదా వేస్తూ అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకర్స్ గ్రామ పంచాయతీ ఎన్నికలలో నామినేషన్స్ వేసే వార్డ్ మెంబర్స్, గ్రామపంచాయతీ సర్పంచ్ లకు ఎన్నికల సందర్భంగా సెపరేట్ ఖాతా అకౌంట్ ఓపెన్ చేయుటకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ బ్యాంకు అధికారులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కి సహకరిస్తూ బ్యాంక్ గ్యారంటీలకు సహకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జీఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి,జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీనివాసరావు, డిపిఓ కల్పన, డిబిసిడిఓ పుష్పలత, డి టి డి ఓ సౌజన్య మెప్మా డిఎఓ రేణుక, సంబంధిత అధికారులు,ఆర్‌బిఐ, బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



**ఘనంగా డివిజన్ అధ్యక్షుడి**

## జన్మదిన వేడుకలు

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందిరమ్మ కాలనీ ఫేస్-1 అధ్యక్షుడు సంతోష్, నరేందర్ చారి, శివపటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సయ్యద్ ఇంతియాజ్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రజలకు పండ్లను సయ్యద్ ఇంతియాజ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, మహిళలు, వేడుకల్లో పాల్గొని అధ్యక్షుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




## ఏసీబీ ట్రాప్‌లో తహాసిల్దార్

**అరెస్ట్, జైలుకు తరలింపు**

**వరంగల్ మహా;** మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండల తహసీల్దార్ మహేందర్ ను ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి రెడ్ హాండెడ్ గా పట్టుకున్నారు. ఓ వ్యక్తి నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా పథకం ప్రకారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. రాత్రి కోర్టుకు సరేండర్ చేసి జైలుకు తరలించారు.



**కాళేశ్వరం ప్రెస్ క్లబ్ 2 సభ్యులను**

## సన్మానం చేసిన ట్రాక్టర్ యూనియన్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల్ కాలేశ్వరం లోని ప్రెస్ క్లబ్ 2 నూతనంగా ఏర్పాటు అయిన సందర్భంగా కాళేశ్వరం ట్రాక్టర్ యూనియన్ వారు మర్యాదపూర్వకంగా కలిసి హరిత హోటల్ వద్ద నూతన ప్రెస్ క్లబ్ 2 సభ్యులను సాల్వతో సన్మానించి శుభాకాంక్షలు తెలియచేసారు ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కోర్కొప్పుల సదాశివ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కాళేశ్వరం ప్రెస్ క్లబ్ 2 సభ్యులకు సాల్వతో సన్మానించి టాక్టర్ యూనియన్ వారి అభిమానానికి ధన్యవాదములు తెలిపారు



**అభివృద్ధి పనులు వేగవంతంగా**

## పూర్తి అయ్యేలా చర్యలు

**వరంగల్ మహా;** అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలసి ఎస్ ఈ సత్యనారాయణ తో కల వివిధ అభివృద్ధి పనుల పై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అమృత్ 2.0 అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం (యు జీ డి), సౌత్ ఏషియా ప్రతినిధులతో (కే ఎఫ్ డబ్ల్యూ) రివ్యూ సమావేశం , అమృత్ వాటర్ సప్లై పురోగతి ఇందు కోసం మంజూరైన రూ.550 కోట్ల పనుల ప్రతిపాదనలు, యు జీ డి పైన ఇటీవల నగరంలో పర్యటించిన సౌత్ ఆసియా ప్రతినిధులు (కే ఎఫ్ డబ్ల్యూ)చర్చించిన తరుణం లో అట్టి ప్రాజెక్ట్ పురోగతి ,ఇటీవల సిడిఎంఎ, ఈ ఎన్ సి ప్రతినిధులతో వర్చువల్ గా నిర్వహించిన సమావేశం లో సాంకేతిక చర్చ కు సంబంధించి అంశాల సమీక్షించి ఆ పనులకు ఈ ఎన్ సి వద్ద త్వరగా అప్రువల్ తీసుకోవాలని మేయర్ ఎస్ ఈ కి సూచించారు.

# చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీలకు అరబిందో విద్యార్థులు

**అభినందించిన పాఠశాల యాజమాన్యం**



**ఆమనగల్లు,మహా:** రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని అరబిందో పాఠశాల విద్యార్థులు ఎన్నికైనారు.వారం రోజుల కింద జరిగిన మండల స్థాయి పోటీల్లో ప్రథమ ర్యాంక్ సాధించి, శుక్రవారం జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు అరబిందో విద్యార్థులు హాజరయ్యారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో ఇంగ్లీష్ మీడియం నుంచి అరబిందో ఉన్నత పాఠశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విభాగం నుండి ఇర్విన్ విద్యార్థులు,మైలర్ దేవుపల్లి విద్యార్థులు, గురుకుల విభాగంలో ఆరుట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు లండన్ పర్వతాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైన అరబిందో పాఠశాల విద్యార్థులు చరణ్, వంశీశివ, రాకేష్ లను పాఠశాల యాజమాన్యము, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల కరస్పాండెంట్ సుధీర్ రెడ్డి, ప్రిన్సిపల్ నాగమణి, ఉపాధ్యాయ బృందం భాస్కర్,నరేష్,నజీర్, సునీత తదితరులు పాల్గొన్నారు

# నామినేషన్ల ప్రక్రియ సాఫీగా పూర్తి చేయాలి - కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ మహా:** గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇచ్చోడ మండలం కోకస్ మన్నూర్, సిరికొండ గ్రామపంచాయతీ, ఇంద్రవెల్లి మండలం ముత్నూర్, ఉట్నూర్ మండలం పులిమడుగు గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, అవసరమైన పత్రాలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులతో మాట్లాడిన కలెక్టర్ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని, అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో ఉట్నూర్ ఎక్స్ రోడ్ వద్ద విధులు నిర్వహిస్తున్న స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ అధికారులను ఐటిడిఏ ఉట్నూర్ పీవో యువరాజ్ మర్మాట్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.ఈ తనిఖీలలో తహసిల్దార్లు రమేష్, తుకారాం, ప్రవీణ్ కుమార్, ఎంపీడీవోలు నరేష్, రాయిస్ ఉల్లా, జీవన్ రెడ్డి, రామ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, రిటర్నింగ్ అధికారులు, ఎస్ఎస్టీ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# గ్రామపంచాయతీ ఎన్నికలలో సత్తా చాటాలి -డీసీసీబీ చైర్మన్

**ఆదిలాబాద్ మహా :** స్థానిక సంస్థల ఎన్నికలో భాగంగా ముందు గ్రామపంచాయతీ ఎన్నికలలో సత్తా చాటాలని కాంగ్రెస్ నాయకులు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గురువారం కంది శ్రీనివాస రెడ్డి ఆదేశాలతో ఆయన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో బేల, జైనథ్, భోరజ్ మండలాల పరిధిలోని గ్రామపంచాయితీల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రానున్న ఎన్నికలకు ఇవి పునాది వంటివని ఇక్కడ బలంగా తయారై ఎన్నికల్లో విజయం సాధిస్తే అదే ఊపుతో మిగతా ఎన్నికలలో కూడా సత్తా చాటేందకు దోహదపడతాయన్నారు. పంచాయతీలలో పార్టీ మద్దతుతో ఎవరు పోటీ చేసినా గ్రామంలోని మిగతా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గెలుపుకోసం సహకరించాలన్నారు.గెలుపే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మూడు మండలాలలోని ఆయా గ్రామపంచాయితీలలో సర్పంచ్, వార్డ్ మెంబర్ల కు పోటీపడే అభ్యర్థులకు నామినేషన్ విషయంలో తగు దిశానిర్దేశం చేసారు.ఆశావహులు గ్రామాల వారీగా తమ పేర్లు కార్యాలయంలో నమోదు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, బాలూరి గోవర్ధన్ రెడ్డి, శాంతన్ రావు, రాందాస్ రాక్లే , శ్రీలేఖ, ఎంఏ షకీల్, రుకేష్ రెడ్డి ,జగదీష్ రెడ్డి ,రాజారెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బేల, జైనథ్, భోరజ్ మండలాలలకు చెందిన ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారతదేశ సామాజిక రాజకీయ చరిత్ర గతిని మార్చిన మహాత్మ జ్యోతిరావు పూలే..



**రాజేంద్రనగర్, మహా :** మహాత్మ జ్యోతిరావు పూలే 135 వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శివకుమార్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివ మాట్లాడుతూ దేశంలో సామాజిక పరిస్థితులలో కొనసాగుతున్న దోపిడి వర్గాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా అట్టడుగు వర్గాల ప్రజలకు సమానత్వ సాధన కోసం పోరాటం చేశారు. అంటరానితనం ,సామాజిక వివక్ష భూస్వాముల ఆగడాలను, నిరసిస్తూ అవిశ్రాంతంగా ఉద్యమం చేశాడు. సంవత్సరాలుగా విద్యకు దూరంగా ఉన్న వర్గాల ప్రయోజనాల కోసం అందరికీ విద్య అందించాలని ఉద్దేశంతో మహాత్మ జ్యోతిరావు పూలే బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన హంటర్ కమిషన్ కి నివేదిక ఇచ్చారు. తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పించి,ఆమె ద్వారా అనేక పాఠశాలలు నెలకొల్పి చదువుకు దూరంగా నెట్టబడ్డిన్నా ప్రజలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ దేశ అభివృద్ధికి విద్యార్థులే కీలకమన్నారు. అజ్ఞానాన్ని వీడి జ్ఞానం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అమీర్, చందు, చైతన్య, ప్రవీణ, వర్ష, సంధ్య, వేదం శ్రీ నాయకులు, మధుకర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల నకిలీ సర్టిఫికెట్లతో నిర్మాణాలు

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 163 లో 2008 లో 176 ప్లాట్లకు లేవాటు చేశారు. అందులో 148, ప్లాట్లను 60 గజాల చొప్పున నిరుపేద కుటుంబాలకు సర్టిఫికెట్లు జారీ చేశారు. 28 ప్లాట్ మిగిలిపోయాయి. మిగిలిపోయిన 28 ప్లాట్ లలో నకిలీ సర్టిఫికెట్లతో నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్తులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఉన్నతాధికారులు ఇందిరమ్మ ప్లాట్ల పై సమగ్ర విచారణ జరిపి ఆక్రమించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అంజయ్య గౌడ్, జయసింహ డిమాండ్ చేశారు.

# చిరకాల మిత్రుడు ఇఫ్తెకార్ ఫెరిఫ్ ఇంట్లో విందు భోజనానికి హాజరైన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**రాజేంద్రనగర్, మహా ;** అమెరికాలో ఉంటున్నా ఇఫ్తెకార్ షరిఫ్, తన చిరకాల మీత్రుడు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,మంత్రి అజారుద్దీన్,లకు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తన ఇంట్లో ఆత్మీయ విందు భోజనం శుక్రవారం ఏర్పాటు చేశారు. విందు అనంతరం చిరకాల మిత్రులు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. వ్యాపార, రాజకీయలలో ఎవరి బిజీ వారు ఉండటం వల్ల కలవలేకపోయాము. పిసిసివచ్చినప్పటి నుంచి చిరకాల మిత్రులనుకలవాలి అనుకున్న సమయం కలిసి రాకపోవడంత కలవలేకపోయానని ఇఫ్తెకార్ షరీఫ్ తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీ ఇంట్లో ఆత్మీయ సమ్మేళనానికిహాజరైన



పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.,అజారుద్దీన్ విహనుమంతరావు, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఫైయిమ్ ఖురేషి, ఎమ్మెల్యే రామగుండంరాజ్ టాకూర్, స్థానిక నాయకులు తదితరులు హాజరయ్యారు.



# మైసిగండి మైసమ్మ హుండి ఆదాయం రూ.15,16,435/-

**ఆమనగల్లు, మహా::** కడ్తాల మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయం ఆదాయం రూ,15,16,435 /వచ్చినట్లు జిల్లా దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ ప్రణీత్ కుమార్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీ పంతు నాయక్, ఈవో స్నేహలత లు తెలిపారు. గత 92 రోజులుగా భక్తులు హుండీలో వేసిన కానుకలను శుక్రవారం లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మైసిగండి మైసమ్మ ఆలయ ప్రధాన అర్చకులు మాదారం యాదగిరి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల శాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి అధ్యక్షుడు కుమ్మరి విఠల్, సంఘం సభ్యులు కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాంతి యువజన సంఘం అధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ.. దేశంలో బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు, బాలికా విద్య కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ పూలే అడుగుజాడల్లో పయనిస్తూ.. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాంతి యువజన సంఘం ప్రధాన కార్యదర్శి వడ్ల కాళిదాస్ చారి, మాల స్వామి, శాంతి యువజన సంఘం మాజీ అధ్యక్షుడు జేల్లెల మల్లేష్ యాదవ్, ముదిగొండ పవన్ యాదవ్, అశోక్ చారి, కుమ్మరి ప్రశాంత్ పాల్గొన్నారు.

# మొయినాబాద్ మండలంలోని నామినేషన్లు స్వీకరించు కేంద్రాలు..

**మొయినాబాద్ మహా:** రెండవ విడత జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలో భాగంగా మండలంలోని ఎన్నికలు జరిగే 19 గ్రామపంచాయతీలు,166 వార్డులకు గాను గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ స్వీకరించేందుకు మొయినాబాద్ మండలంలోని 5 క్లస్టర్ గ్రామాలను ఎన్నికల నామినేషన్ కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు ఎంపీడీవో సంధ్య తెలిపారు. కనకమామిడి, అప్పారెడ్డిగూడ, కేతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు కనుకమామిడి గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారని తెలిపారు. చిన్న మంగళారం, మేడిపల్లి, కుత్బుద్దీన్ గూడ, ఎల్కగూడ, పంచాయతీల నామినేషన్లు చిన్న మంగళారం జీపీ కార్యాలయం, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, పంచాయతీల నామినేషన్లు చందానగర్ జీపీ కార్యాలయం, శ్రీరాంనగర్, తోల్కట్ట, నక్కలపల్లి, ఎత్బర్ పల్లి, వెంకటాపూర్ పంచాయతీల నామినేషన్లు శ్రీరాంనగర్ జీపీ కార్యాలయం, బాకారం, నాగిరెడ్డిగూడా, అమ్డాపూర్, కాశింబౌలి గ్రామాలలో పోటీ చేసే అభ్యర్థులు బాకారం గ్రామపంచాయతీ కార్యాలయలలో నవంబర్ 30, డిసెంబర్ 1, 2 తేదీలలో ఉదయం 10:30 గంటలకు నుండి సాయంత్రం 5 గంటల లోపు తమ నామినేషన్లు దరఖాస్తులను సమర్పించుకోవాలని ఎంపీడీవో తెలిపారు.



# ప్రతి గ్రామంలో బీజేపీ అభ్యర్థిని సర్పంచ్‌గా గెలిపించుకోవాలి:ఆచారి

**ఆమనగల్లు, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే సర్పంచులుగా గెలిపించాలని జాతీయ ఓబిసి మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి కోరారు. శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు పార్టీ కార్యకర్తల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి బీజేపీ జెండా ఎగుర వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కండె హరిప్రసాద్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరేటి నరసింహ, బిజెపి మండల అధ్యక్షులు ఎరవోలు శ్రీనివాస్ కేకే, జిల్లా కౌన్సిల్ సభ్యులు సింగం సీనయ్య, చెక్కల లక్ష్మణ్, మాజీ మండల అధ్యక్షులు పి లక్ష్మణరావు, బిజెపి మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి సింగంపల్లి శ్రీను, బీజేవైఎం అధ్యక్షులు శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ సర్పంచ్, వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు

# అంగన్వాడి కేంద్రంలో అన్నప్రసన్న వేడుక

**పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలక్ష్మి**



**మొయినాబాద్ మహా:** అంగన్వాడి కేంద్రం 2 ఆధ్వర్యంలో చిన్నారులకు అన్న ప్రసన్న కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడిలలో నిర్వహించే నెలసరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల అంగన్వాడి కేంద్రం 2 లో ఉన్న మహిళల యొక్క ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రసన్న వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్వైజర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణీ అయిన ప్రతి ఒక్క మహిళ అంగన్వాడి కేంద్రంలో లభించే అన్ని సౌకర్యాలను ఉపయోగించుకొని అంగన్వాడీ టీచర్లు చెప్పే ఆరోగ్య సూత్రాలను పాటించినప్పుడే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, ఆమె తెలిపారు. పిల్లల్లో ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంధం పోషకాహారం అందించాలని తల్లులకు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీ, మణెమ్మ, రోస్ మేరీ, అంగన్వాడి టీచర్లు కవిత, అమారజని, ఆశా వర్కర్లు లక్ష్మి, శివరాణి, సుకీర్తి, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు న్యాయపరమైన పరిహారం

**ఆమనగల్లు, మహా:** తమ భూములు లాక్కొని పొట్టకొట్టవద్దని భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి, సాకిబండ గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూ నిర్వాసితులతో శుక్రవారం తహసీల్దార్ ఖాద్రి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టరు చంద్రారెడ్డి, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు న్యాయపరమైన పరిహారం అందించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేష్, శ్రీకాంత్, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** వరి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల భవనం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి, పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, మెప్మా అధికారులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేసి మద్దతు ధర అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో గ్రామీణ అభివృద్ధి సంస్థ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఐ కె పి, డి సి ఎం ఎస్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా చేపట్టిన 202526 వానకాలం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు టార్పాలిన్లు, గోనె సంచులు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలని సమకూర్చాలని ఆదేశించారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం, రైతుల వివరాలను ట్యాబ్ లలో నమోదు చేయాలని, మద్దతు ధర ప్రకారం సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేయాలని ఆయన స్పష్టం చేశారు. అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను ప్రతి రోజు సందర్శించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశించారు.

## అణగారిన వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన

# సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే...

**కార్పొరేటర్ తోకల...**



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాజేంద్ర నగర్ చౌరస్తా లో సామాజిక అసమానతల పై అలుపెరుగని పోరాటం చేసి, అణగారిన వర్గాల, విద్యాభివృద్ధి కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, మహాత్మా జ్యోతి బా పూలే 135 వ వర్ధంతి సందర్భంగా రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జ్యోతి బా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిరావు పూలే కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే సమాజం రూపురేఖలు మారుతాయి..



**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్...**

**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్ర నగర్ లొ జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు పీట్ల శ్రీధర్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులువల్లపు శివ, బీసీ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ. ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం మహాత్మ జ్యోతిభా పూలే చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. విద్య ద్వారానే ఈ సమాజం యొక్క రూపురేఖలు మార్చగలం ప్రతి విద్యార్థి ఉన్నత విద్య చదువుకోవాలి, విద్యా హక్కు చట్టం అమలు చేయాలి, రాష్ట్ర ప్రభుత్వం మరో 119 గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలి, విద్యకు పెద్దపీట వెయ్యాలి అని పలువురు వడ్డెర సంఘం నాయకులు అన్నారు. రాజేంద్రనగర్ లోనే వడ్డెర విద్యార్థుల వసతి గృహం ఉన్నదని గుర్తు చేశారు... పేద విద్యార్థులకు పెన్ను, నోట్ బుక్స్ ను అందించారు.

# బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదు!

**బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలి**

**సర్పంచ్ ఎన్నికలలో అన్ని పార్టీలు బీసీలకు న్యాయం చేయాలి**

**ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలు, ప్రభుత్వ అవకాశాలు పొందేకాడ చాలా అన్యాయానికి గురవుతున్నారని పోతుగంటి కృష్ణ అన్నారు. సమాజానికి ఎన్నో సేవలు చేస్తూ సాటి మనుషులకు తోడ్పాటును అందిస్తూ సమాజ అభివృద్ధికి సహాయపడుతున్న బీసీలకు అన్ని విధాలుగా అన్యమే జరుగుతుందని వారి అభివృద్ధికి ఏ చిన్న మార్గం కూడా లేకుండా పోయిందని, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం 42 % రిజర్వేషన్లు కలిపిస్తే 5300 మంది సర్పంచులు అయ్యేవారు. కానీ 17 శాతానికి కుదించడంతో 2176 మందికె పరిమితమయ్యారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీల కన్నా ఎక్కువ ఉన్న బిసి ప్రజలకు అన్నివిధాలుగా నిరాశనే ఎదురైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్ష పార్టీలు అందరు మద్దతిచ్చిన కూడా సాంకేతిక కారణంగా మళ్లీ అన్యాయమే జరిగిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బడుగు బలహీన దళిత గిరిజన ప్రజల అభ్యున్నతి కోసమే పని చేస్తున్నాం అని చెప్పుకుంటారు. కానీ బీసీలకు జరుగుతున్న అన్యాయానికి కొంత పరిష్కారం చూపేవిధంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్, కేంద్ర అధికార పార్టీ బీజేపీలు మిగత బహుజన, కమ్యూనిస్టు అన్ని పార్టీలు సర్పంచ్ వార్డ్ మెంబర్ స్థానాలకు సీట్లు కేటాయించేటప్పుడు బీసీలకు పెద్దపీట వేయాలని పోతుగంటి కృష్ణ కోరారు. బీసీ వర్గాలను లెక్కచేయకుండా ఆధిపత్య నాయకులకు పట్టం కడితే ఎమ్మార్పీఎస్ సంఘం తరపున కచ్చితంగా తగిన బుద్ధి చెప్తాం. మిగత సామాజిక సంఘాలతో కలిసి బిసిలను రాజకీయంగా ముందుకు వెళ్లేలా సహాయపడతామని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ తెలిపారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను మరువలేము

**సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఆర్భాటంగా నిర్వహించారు**

**రాజేంద్రనగర్, మహా :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి వేడుకలను యూనిటీ ఫర్ మార్చ్ కార్యక్రమం జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ పటేల్ విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రసాద్ నేషనల్ యూత్ డైరెక్టర్ తెలంగాణ, పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ జిల్లా అధ్యక్షులు, ఐసయ్య జిల్లా యూత్ ఆఫీసర్లు జెండా ఊపి యూనిటీ ఆఫ్ మార్చ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 1947 స్వతంత్రం వచ్చినప్పుడు 650 సంస్థానాలను విలీనం చేసిన ఘనత సర్దార్ పటేల్ కే దక్కింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ కు ఉక్కుమనిషి, దృఢ సంకల్పం వల్లనే వచ్చింది. తెలంగాణ రాష్ట్రాని నిజాం సంకెళ్ల నుండి విమోచన గావించిన మహనీయుడు. జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి మాట్లాడుతూ దేశానికి దశా దిశా చూపించే ఐపిఎస్ అధికారులు మన రాజేంద్రనగర్ లోనే శివరాంపల్లిలో ట్రైనింగ్ పొందుతున్నారు, ఈ ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కి దక్కుతుందని కొనియాడాలరు. ఈ కార్యక్రమం హైదర్గూడా జంక్షన్ నుండి ప్రారంభమై 143 పిల్లర్ నెంబర్, ఈశ్వర్, థియేటర్, గోల్డెన్ ప్యాలెస్ హోటల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుండి పిల్లర్ నెంబర్ 144 సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు యూనిటీ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య కాలేజ్ అత్తాపూర్ బ్రాంచ్ యువతీ యువకులు, ఉషోదయ స్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, విద్యార్థిని విద్యార్థులు, అత్తాపూర్ రాజేంద్రనగర్ యువకులు, అంజన్ కుమార్ వైస్,శ్రీధర్, కొమురయ్య పి, మల్లేష్ యాదవ్, కాడం సుధాకర్, సాబాద విజయకుమార్, గొరిగె రాజు, ఎస్ వెంకటేష్ పి, సందీప్, జయ ఆనంద్ రెడ్డి, యం,నగేష్, బిక్షపతి యాదవ్, కాకులారం కృష్ణ,, కిరణ్ చారి, ఎస్ మణికంఠ, విజయ భాస్కర్ రెడ్డి, పిఎస్ మల్లారెడ్డి,రామ్ చందర్ రావు,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు



# ఆర్‌బీఐ కీలక వడ్డీ రేటు తగ్గింపు?



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) డిసెంబర్ 5న జరగబోయే మానిటరీ పాలసీ సమావేశంలో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.25 శాతానికి చేర్చే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఆహార ధరల పతనం, ఇటీవల వినియోగ వస్తువులపై ప్రకటించిన పన్ను తగ్గింపుల కారణంగా ద్రవ్యోల్బణం రికార్డు కనిష్ట స్థాయికి చేరుకుంది. దాంతో వినియోగానికి మద్దతు ఇవ్వడానికి ఆర్‌బీఐ రేటు తగ్గిస్తుందని భావిస్తున్నారు.

**రికార్డు కనిష్టానికి ద్రవ్యోల్బణం**

అక్టోబర్‌లో భారతదేశ వినియోగదారుల ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో 0.25%కి చేరుకుంది. ఇది సెంట్రల్ బ్యాంక్‌కు రేట్ల తగ్గింపునకు అవకాశం ఇస్తుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 89.49 వద్ద కొత్త కనిష్టాన్ని తాకినప్పటికీ, దేశీయంగా బలహీనపడుతున్న డిమాండ్‌ను పెంచేందుకు ఆర్‌బీఐ మొగ్గు చూపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఓ సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన ఆర్థిక గణాంకాలు వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఇంకా ఉందని సూచించాయని పేర్కొన్నారు. ఏడాది మొదటి అర్ధభాగంలో 100 బేసిస్ పాయింట్ల కోత తర్వాత ఆర్‌బీఐ ఆగస్టు నుంచి రేట్లను యథాతథంగా కొనసాగిస్తోంది.

**ఆర్థికవేత్తల అంచనాలు**

నవంబర్ 1826 మధ్య నిర్వహించిన రాయిటర్స్ పోల్‌లో 18 మంది ఆర్థికవేత్తలు ఆర్‌బీఐ తన డిసెంబర్ 35 పాలసీ సమావేశం ముగిసే సమయానికి రెపో రేటును 5.25 శాతానికి తగ్గిస్తుందని అంచనా వేశారు. మరో 18 మంది మాత్రం ఎలాంటి మార్పు ఉండదని భావించారు. డ్యూయిష్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ కౌశిక్ దాస్ మాట్లాడుతూ '20252026 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణ అంచనాను మరింత సవరించే అవకాశం ఉన్నందున 25 బేసిస్ పాయింట్ల రేటు తగ్గింపు ఉంటుందనే అంచనాలున్నాయి' అన్నారు.

# దేశం వీడుతున్న సంపన్నులు



భారత్‌లోని చాలామంది అత్యంత ధనవంతులు దేశాన్ని వదిలివెళ్తున్న ధోరణి పెరుగుతోంది. దీనికి కారణం పన్నుల నుంచి తప్పించుకోవడం కాదని.. ఇతర అవసరాలున్నాయని ప్రముఖ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ అక్షత్ శ్రీవాస్తవ అన్నారు. ధనవంతులు తమ కుటుంబాలకు మెరుగైన జీవితాన్ని, భద్రతను, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే కోరికతోనే దేశం విడిచి పోతున్నారని తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. సంపన్న వర్గాలైన హై నెట్ వర్త్ వ్యక్తులు (HNI) విదేశాలకు మకాం మారుస్తుండడంపై కారణాలు తెలుసుకునేందుకు వెళ్లిన వారితో ఆయన ఈ వివరాలు పంచుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చాలా మంది సంపన్నులు విదేశాలకు వెళ్లాలని నిర్ణయించుకోవడానికి ప్రధాన కారణాలు కింది విధంగా ఉన్నాయి. నగరాల్లో పెరుగుతున్న వాయు కాలుష్యం ప్రధానం. దాదాపు 15 ఏళ్ల కిందట పరిస్థితి ఎలా ఉందో ఇప్పటికీ అందులో ఎలాంటి మార్పు లేదు. ఈ పరిస్థితులు ఇంకా దిగజారాయి. కుటుంబం, పిల్లల భద్రత గురించి చాలా మంది దేశం వీడుతున్నారు. పిల్లలకు ఉన్నత విద్యా, వృత్తిపరమైన అవకాశాలను కల్పించాలనే తపనతో కొందరు ఇతర దేశాలకు వెళ్తున్నారు. దేశంలో మౌలిక సదుపాయాల అంతరాలు, అధిక పని భారంతో కూడిన న్యాయవ్యవస్థ వంటి వ్యవస్థాగత సమస్యలతో కొందరు బయటకు పోతున్నారు. ఈ ధనిక పన్ను చెల్లింపుదారులు దేశం విడిచి వెళ్లడం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన ముప్పుగా పరిణమించవచ్చని శ్రీవాస్తవ హెచ్చరించారు. 'భారతదేశంలో 2 శాతం కంటే తక్కువ మంది మాత్రమే ప్రత్యక్ష పన్నులు చెల్లిస్తున్నారు. ఒక హెచ్‌ఎన్‌ఐ పన్ను చెల్లింపుదారుడు దేశం నుంచి వెళ్లిపోతే మిగిలిన 98% మందికి ఇది పెద్ద నష్టం. అంటే, దేశంలో పన్ను చెల్లింపుదారులు అతి తక్కువగా ఉన్న తరుణంలో ఎక్కువ పన్నులు చెల్లించే సంపన్న వర్గం నిష్క్రమిస్తే ప్రభుత్వంపై, మిగిలిన ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతుంది' అన్నారు.

# ఊహించిన దాని కంటే మెరుగైన వృద్ధి




భారత ఆర్థిక వ్యవస్థ 2026 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (జులైసెప్టెంబర్) అనూహ్యంగా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 8.2 శాతానికి పెరిగింది. ఇది గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 5.6% వృద్ధి కంటే గణనీయమైన పెరుగుదలను నమోదు చేసింది. ఇది కొన్ని సర్వేలు అంచనా వేసిన 7.3 శాతం వృద్ధి రేటును మించిపోయింది. ఇటీవల ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) హేతుబద్ధీకరణ వస్తువుల వినియోగాన్ని పెంచుతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. కేర్ ఎడ్జ్ రేటింగ్స్ చీఫ్ ఎకనామిస్ట్ రజనీ సిన్హా తెలిపిన వివరాల ప్రకారం.. 2026 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో వ్యవసాయం, తయారీ, నిర్మాణ రంగాలు భారీగా వృద్ధి నమోదు చేశాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచిక సగటున 4.1% పెరిగింది (గత సంవత్సరం 2.7%), తయారీ ఉత్పత్తి 4.9% పెరిగింది (గత సంవత్సరం 3.3%) అన్నారు. మెరుగైన వ్యవసాయ ఉత్పత్తి కారణంగా గ్రామీణ వ్యయం పెరగడంతో ఆర్థిక వ్యవస్థలో సుమారు 60% వాటాను కలిగి ఉన్న గృహ వినియోగం బలపడింది. సెప్టెంబర్ త్రైమాసికంలో ప్రభుత్వ మూలధన వ్యయం 31% పెరిగింది. ఇది మునుపటి త్రైమాసికంలో 52% పెరుగుదల కంటే నెమ్మదిగా ఉన్నప్పటికీ, సంవత్సరం క్రితం నమోదైన 10% వృద్ధి కంటే మెరుగ్గా ఉంది. సరుకుల ఎగుమతులు 8.8% పెరిగాయి. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 7% తగ్గుదలను ఈ గణాంకాలు తిప్పికొట్టాయి. యూఎస్ సుంకాల అమలు కంటే ముందు ఫ్రంట్ లోడెడ్ షిప్‌మెంట్ల ద్వారా ఈ పెరుగుదల నమోదైంది.

**జీఎస్టీ కోతలతో పెరిగిన డిమాండ్**

భారతదేశం సెప్టెంబర్ 22 నుంచి చాలా వస్తువులపై జీఎస్టీ రేట్లను సవరించింది. ప్రపంచంలోని ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌లో ఇది వినియోగాన్ని మరింత పెంచుతుందని భావిస్తున్నారు. ఈ జీఎస్టీ తగ్గింపులు అమల్లోకి రాకముందే గృహోపకరణాలు, కిరాణా సామాగ్రికి డిమాండ్ పెరిగినట్లు కొన్ని సంస్థలు నివేదికలు రూపొందించాయి. జీఎస్టీ పునర్వ్యవస్థీకరణ వల్ల సామాన్య ప్రజలకు రూ.2 లక్షల కోట్లు మిగులనుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ అదనపు డబ్బు భవిష్యత్తులో వినియోగాన్ని మరింతగా పెంచడానికి దోహదపడుతుంది.

**ఆందోళన కలిగించే అంశాలు**

అద్భుతమైన జీడీపీ వృద్ధి సాధించినప్పటికీ కొన్ని ఆందోళన కలిగించే అంశాలు కూడా ఉన్నాయని రాయిటర్స్ నివేదించింది. ముఖ్యంగా పట్టణ డిమాండ్, ప్రైవేట్ పెట్టుబడులు వెనుకబడుతున్నట్లు పేర్కొంది. గ్రామీణ డిమాండ్ పుంజుకున్నప్పటికీ స్థిరమైన, సమగ్రమైన వృద్ధికి పట్టణ డిమాండ్, ప్రైవేట్ రంగ పెట్టుబడుల పునరుద్ధరణ కూడా కీలకం.

# డిసెంబర్ 11న మరో యాపిల్ స్టోర్



భారతదేశంలో యాపిల్ కంపెనీ ఎప్పటికప్పుడు తన ఉనికిని విస్తరిస్తూనే ఉంది. ఇందులో భాగంగానే.. సంస్థ నోయిడాలో యాపిల్ స్టోర్ ప్రారభించడానికి సన్నద్ధమైంది. దీనిని 2025 డిసెంబర్ 11న ప్రజలకు అందుబాటులోకి తెస్తామని యాపిల్ అధికారికంగా ప్రకటించింది. ఇది దేశంలో.. కంపెనీకి ఐదవ రిటైల్ అవుట్‌లెట్. కాగా కంపెనీ వచ్చే ఏడాది ముంబైలో రెండవ స్టోర్‌ను ప్రారంభించనుంది. డీఎల్ఎఫ్ మాల్ ఆఫ్ ఇండియా లోపల ఉన్న ఈ స్టోర్.. నెమలి ఈకల మాదిరిగా ఉండే థీమ్ పొందింది. ఈ డిజైన్ థీమ్‌ను గతంలో పూణేలోని కోరెగావ్ పార్క్ మరియు బెంగళూరులోని హెబ్బాల్‌లోని యాపిల్ స్టోర్ వద్ద ప్రదర్శించారు. కొత్తగా ప్రారంభం కానున్న కొత్త యాపిల్ స్టోర్‌లో లేటెస్ట్ ఐఫోన్ 17 సిరీస్‌తో సహా.. యాపిల్ ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. బెంగళూరు, పూణేలలో యాపిల్ కొత్త అవుట్‌లెట్‌లను ప్రారంభించిన తర్వాత.. కంపెనీ ఇప్పుడు నోయిడా స్టోర్ ప్రారంభించడానికి సిద్ధమైంది. దీన్నిబట్టి చూస్తే కంపెనీకి మన దేశంలో మంచి డిమాండ్ ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. యాపిల్ తన మొదటి రెండు ఇండియా స్టోర్‌లను.. ముంబైలోని BKC & ఢిల్లీలోని సాకేత్‌లలో ఏప్రిల్ 2023లో ప్రారంభించింది. ఈ రెండు స్టోర్‌ల నుంచి తొలి ఏడాదే.. రూ. 800 కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం. దీంతో ఇది ప్రపంచవ్యాప్తంగా యాపిల్ అత్యంత బలమైన పనితీరు కనబరిచిన అవుట్‌లెట్‌లలో ఒకటిగా నిలిచింది. దాదాపు 60 శాతం అమ్మకాలు చిన్న సాకేత్ స్టోర్ ద్వారా జరిగాయి.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ట్రంప్ బ్యాన్ వార్నింగ్.. అసలేంటీ మూడో ప్రపంచ దేశాలు



మూడో ప్రపంచ దేశాల వలసల విషయంలో కఠిన వైఖరి అవలంభించబోతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. వైట్‌హైజ్ సమీపంలో జరిగిన ఉగ్రదాడే ఇందుకు ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో అసలు ఆ మూడో ప్రపంచ దేశాలంటే ఏంటనే ప్రశ్న తెర మీదకు వచ్చింది.. బుధవారం అమెరికా వైట్ హౌస్ వద్ద అఫ్గాన్ దేశానికి చెందిన ఓ వ్యక్తి నేషనల్ గార్డ్స్ సిబ్బందిపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఓ మహిళా సిబ్బంది మరణించగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై భగ్గుమన్న ట్రంప్.. మరోసారి ఇమిగ్రేషన్ పాలసీపై కఠిన ఆంక్షల ప్రస్తావన తీసుకొచ్చారు. "నేను శాశ్వతంగా మూడో ప్రపంచ దేశాల పౌరులను అమెరికాలోకి అడుగుపెట్టకుండా నిషేధిస్తాను. బైడెన్ ప్రభుత్వంలో అక్రమంగా దేశంలోకి చొరబడిన వారిని పంపిస్తాను. అదే విధంగా దేశానికి ఉపయోగకరంగా లేకుండా అమెరికాను ప్రేమించకుండా ఉన్న వారిని దేశం నుంచి పంపిస్తాను. అమెరికాలో శాంతిని దెబ్బతీసేవారిని సభ్యత్వం రద్దు చేస్తాను. వారికి మన దేశంలో ఎటువంటి సబ్సిడీలు అందకుండా చేస్తాను" అని ఓ సుదీర్ఘమైన పోస్ట్ చేశారు.

**మూడో ప్రపంచ దేశాలంటే..**

కోల్డ్ వార్ సమయంలో(19471991) మొదటి సారిగా ప్రపంచ దేశాలను విభజిస్తూ పదం వాడారు. పెట్టుబడిదారి వ్యవస్థ, నాటో కూటమిలో సభ్యత్వం కలిగిన దేశాలను మొదటి ప్రపంచ దేశాలుగా పిలిచేవారు. వీటికి అమెరికా నేతృత్వం వహించేది. ప్రణాళికమైన ఆర్థిక వ్యవస్థ వార్సా ఒప్పందంలో (నాటోకి ప్రత్యామ్నాయంగా) భాగమైన దేశాలను రెండవ ప్రపంచ దేశాలుగా పిలిచేవారు. ఈ దేశాలకు యూ.ఎస్.ఎస్ఆర్ నాయకత్వం వహించేది. ఈ రెండు కూటముల్లో చేరకుండా తటస్థంగా ఉన్న దేశాలను మూడో ప్రపంచ దేశాలు అనేవారు. అయితే.. ఆ సమయంలో అభివృద్ధి చెందకుండా ఉన్న దేశాలను, పేదరికంలో మగ్గే దేశాలను మూడో ప్రపంచ దేశాల కేటగిరీలో చేర్చారు. ఈ జాబితాలో ఆనాడు భారత్ కూడా ఉండేది. అయితే ఈ భావన కేవలం రాజకీయ పదం మాత్రమే. దీనికంటూ ఓ అధికారిక గుర్తింపులాంటిదేం లేదు.

**ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంతో..**

ట్రంప్ తాజా ప్రకటన నేపథ్యంతో ఆ మూడో ప్రపంచ దేశాలు ఏంటా? అని వెతుకులాట మొదలైంది. యూఎస్ ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. థర్డ్ వరల్డ్ కంట్రీస్ అనే పదానికి అసలే అర్థమే లేదు. అయితే ఐక్యరాజ్య సమితి ప్రకారం అత్యంత అభివృద్ధి చెందిన జాబితాలో 44 దేశాలు ఉన్నాయి. ఇందులో ఆఫ్రికా నుంచి 32 దేశాలు, ఆసియా నుంచి 8 దేశాలు, ఒక కరేబియన్ దేశం(హైతీ,), ఫసిఫిక్ రీజియన్‌లోని మూడు దేశాలు ఉన్నాయి. ఈ లెక్కన అభివృద్ధి లేకుండా పేదరికంలో మగ్గుతున్న దేశాలను మూడో ప్రపంచ దేశాలుగా భావించొచ్చు.

**ఆయన ఉద్దేశం అదేనా?..**

అయితే ట్రంప్ డిక్షనరీలో దీనర్థం వేరే అయ్యి ఉండొచ్చు. ఎందుకంటే.. గతంలో ట్రంప్ యూఎస్‌కు వచ్చే 12 దేశాల పౌరుల రాకపై నిషేధం విధించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ లిస్ట్‌లో అఫ్గానిస్థాన్, ఇరాన్, యెమెన్, మయన్మార్, చాద్, కాంగో, ఈక్వెటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, లిబియా, సోమాలియా, సూడాన్ దేశాలు ఉన్నాయి. వీటితోపాటు ఏడు దేశాల ప్రయాణికులపైనా అప్పట్లో పాక్షికంగా నిషేధం విధించారాయన. దీంతో తాజా ప్రకటన ఆ దేశాలను ఉద్దేశించేనా? అని విశ్లేషణ నడుస్తోంది.

**ఇంతకీ భారత్ ఎక్కడుంది?**

ట్రంప్ థర్డ్ వరల్డ్ కంట్రీస్ ప్రకటనతో రాజకీయ విశ్లేషకులు సైతం జుట్టు పీక్కుంటున్నారు. అసలు ఆయన ఏ ప్రతిపాదికన ఆ వార్నింగ్ ఇచ్చి ఉంటారో అర్థం కాక యూఎస్ సాయం మీద ఆధారపడిన పేద దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతానికైతే అభివృద్ధి చెందుతున్న దేశాలు, లో.. లోయర్ మిడిల్ ఇన్‌కమ్ దేశాలు అనే పాదాలను వాడుతున్నారు. ఒకప్పుడు భారత్ థర్డ్ వరల్డ్ కంట్రీస్ జాబితాలోనే ఉండేది. అయితే.. ఇప్పుడు భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం. అంతేకాదు.. ఈ మధ్యే జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది కూడా.



## ఆపరేషన్ సింధూర్ ఎఫెక్ట్..
# మూడో ప్లేసులో భారత్

పుల్వామా అటాక్ కు ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ భారత్ సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలిసేలా చేసింది. ఈ నేపథ్యంలో ఇటీవల లోవీ ఇనిస్టిట్యూట్ చేపట్టిన సర్వేలో భారత్ 40 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. అమెరికా 80 పాయింట్లతో మొదటి స్థానంలో నిలువగా చైనా 73.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. భారత్ తరువాత 38.8 తో జపాన్, 32.1తో రష్యా వరుసగా , నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి. అయితే రక్షణ నెట్ వర్క్ ల అంశంలో భారత్ రెండు స్థానాలు కోల్పోయి 11 స్థానంలో నిలిచింది. అదే పెట్టుబడులను ఆకర్షించే అంశంలో చైనాను వెనక్కి నెట్టి భారత్ రెండో స్థానంలో నిలిచింది. ఈ సూచికలో అమెరికా మొదటి ప్లేస్ లో ఉంది. ఆర్థిక, మిలిటరీ రంగాలలో మంచి పురోగతి సాధించడంతోనే భారత్ ర్యాంకు మెరుగుపడిందని విశ్లేశకులు అంచనా వేస్తున్నారు. సాంకేతికత, పరపతి, అంతర్జాతీయ సంబంధాలు తదితర అంశాల ఆధారంగా ర్యాంకులను లోవీ ఇనిస్టిట్యూట్ ర్యాంకులను ప్రకటిస్తుంది. భారత్ సైనిక సామర్థ్యం ప్రస్తుతం ఎంతో మెరుగ్గా ఉందని సంస్థ పేర్కొంది.

# రూ. 26వేల జీతం.. ₹70000 ఐఫోన్: మండిపడుతున్న నెటిజన్స్



ఈ రోజుల్లో ఐఫోన్ కొనుగోలు చేయడం అనేది.. చాలామందికి ఫ్యాషన్ అయిపోయింది. ఈ కారణంగానే కొత్త మోడల్ మార్కెట్లోకి రాగానే ఎగబడిమరీ కొనేస్తుంటారు. ధరలు ఎంత ఉన్నప్పటికీ.. తగ్గేదే అన్నట్టు ఈఎంఐ ఎంపిక చేసుకుంటున్నారు. ఇటీవల రూ. 26వేలు జీతం ఉన్న వ్యక్తి.. రూ. 70000 ఐఫోన్ కొన్నారు. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఢిల్లీకి చెందిన కవల్జీత్ సింగ్ (ఖడక్ సింగ్ దా ధాబా కో ఫౌండర్, ది చైనా డోర్ ఫౌండర్) తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన సమాచారం ప్రకారం.. రూ. 26,000 జీతం ఉన్న తన ఉద్యోగి రూ. 70,000 ఐఫోన్‌ను ఎలా కొన్నారో వివరించారు. తన ఉద్యోగి ఇంత బాధ్యతారహితమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం.. తెలుసుకుని ఆయన ఆశ్చర్యపోయారు. ఐఫోన్ కొన్న ఉద్యోగి.. తన కంపెనీలో డెలివరీ డ్రైవర్‌గా చేరారని, కొన్ని సంవత్సరాలలోనే అతడు స్థానిక కార్యకలాపాలను చూసుకుంటున్నారని కవల్జీత్ సింగ్ అన్నారు. అయితే ఈ మధ్యకాలంలో సంస్థ నుంచి రూ. 14000 అడ్వాన్స్ తీసుకుని, మిగిలిన మొత్తాన్ని 12 నెలల ఈఎంఐ ఆప్షన్ కింద చెల్లింపు ఎంచుకున్నాడు. తన జీతం రూ. 26000, ఇప్పుడు ఐఫోన్ కోసం అడ్వాన్స్ తీసుకున్నాడు, ఈఎంఐ ఆప్షన్ ఎంచుకున్నాడు. అయితే అతనిపై తన ముగ్గురు పిల్లలు, భార్య ఆధారపడి ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో.. అతడు ఐఫోన్ కొనడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించిందని కవల్జీత్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. కొందరు అతని నిర్ణయాన్ని తప్పుపట్టారు. మరికొందరు కవల్జీత్ సింగ్ తక్కువ జీతం ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ఎవరైనా జోక్యం చేసుకుని.. తాను తీసుకునే నిర్ణయం తప్పు అని చెప్పి ఉంటే బాగుండేదని అన్నారు.

# థాయ్‌లాండ్‌లో భారీ వర్షాలకు 145 మంది మృతి



భారీ వర్షాలతో థాయిలాండ్ అతలాకుతలం అవుతోంది. కుంభవృష్టి ధాటికి పెద్ద ఎత్తున వరదలు రావడంతో 145 మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మంది నిరాశ్రయులయ్యారు. దీంతో విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. దక్షిణ థాయిలాండ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. 12 దక్షిణ ప్రావిన్సులలో ఎడతెరపి లేకుండా వానలు కురుస్తున్నాయి. వరదలు పోటెత్తడంతో 145 మంది మృతి చెందారు. కేవలం సాంగ్లా ప్రావిన్సులోనే 110 మరణించారని అక్కడి అధికారులు తెలిపారు. అధిక సంఖ్యలో భవనాలు నీటమునిగాయని.. వరదల దాటికి రోడ్లు కొట్టకుపోయాయని, తీవ్ర స్థాయిలో ఆస్తి నష్టం సంభవించిందని తెలుస్తోంది. అయితే.. ఈ వరదల ప్రభావంతో 32 లక్షల మంది ప్రభావితం అయ్యారని ఆ దేశ మీడియా కథనాలు పేర్కొన్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఇప్పటికీ చాలా ప్రాంతాలు జలమయంలోనే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. భారీ స్థాయిలో కురిసిన వర్షాలకు ప్రజల దైనందిన జీవితం దెబ్బతింది. ప్రస్తుతం నీటిమట్టం తగ్గడంతో విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు.



# ఛాన్స్ వస్తే పవన్ కళ్యాణ్‌తో డేటింగ్ చేస్తా..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం సినిమాలతో పాటు రాజకీయాల్లోనూ బిజీగా ఉన్నరు. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే.. ఇక పవన్ సినిమాల విషయానికొస్తే ఇప్పటికే రెండు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మొన్నామధ్య హరిహరవీరుమల్లు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు పవన్. ఈ సినిమా మిక్స్డ్ టాక్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత రీసెంట్ గా ఓజీ సినిమాతో మరోసారి థియేటర్స్ దగ్గర సందడి చేశారు పవన్. సుజిత్ దర్శకత్వంలో వచ్చిన ఓజీ మంచి విజయాన్ని అందుకుంది. యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కిన ఓజీ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ సినిమాలో పవన్ లుక్స్, యాక్షన్, ప్రేక్షకులను ముఖ్యంగా పవన్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఓ ముద్దుగుమ్మ పవన్ కళ్యాణ్ తో డేటింగ్ చేస్తా.. అని చెప్పి షాక్ ఇచ్చింది. పవన్ కళ్యాణ్ తో డేటింగ్ చేస్తానన్నా ఆ బ్యూటీ ఎవరో తెలుసా..? తన అందంతో ప్రేక్షకులను విశేషంగా కవ్వించిన బ్యూటీస్ లో ఫరియా అబ్దుల్లా ఒకరు.. నవీన్ పోలిశెట్టి హీరోగా నటించిన జాతిరత్నాలు సినిమాతో ఓవర్ నైట్ లో క్రేజ్ తెచ్చుకుంది ఈ అందాల భామ. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్న ఫరియా అబ్దుల్లా ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. గతంలో ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది. నీకు ఛాన్స్ వస్తే ఎవరితో డేట్ చేస్తావ్.? ఎవరిని పెళ్లి చేసుకుంటావ్.? అని సుమ అడిగితే.. ఊహించని సమాధానం చెప్పింది ఈ ముద్దుగుమ్మ. నాకు ఛాన్స్ వస్తే పవన్ కల్యాణ్ తో డేటింగ్ చేస్తా.. ప్రభాస్ ను పెళ్లి చేసుకుంటా.. అని చెప్పకొచ్చింది ఈ చిన్నది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ఈ కామెంట్స్ పై పవన్ , ప్రభాస్ అభిమానులు రకరకాలుగా స్పందిస్తున్నారు. కాగా సోషల్ మీడియాలో ఫరియా అబ్దుల్లా గ్లామర్ గేట్లు ఎత్తేసి ఓ రేంజ్ లో కుర్రాళ్లను కవ్విస్తుంది.



# మనుషుల మాంసంతో కూరలు వండే మహిళ..

కొన్ని సినిమాలు, వెబ్ సిరీస్ లు మరీ దారుణంగా ఉంటాయి. ముఖ్యంగా ఓటీటీ సినిమాలు, వెబ్ సిరీస్ లకు సెన్సార్ లేకపోవడంతో యథేచ్ఛగా శృంగార, హింసాత్మక సన్నివేశాలను జోడిస్తున్నారు. ఒక్కోసారి సినిమాలోని కంటెంట్ కూడా వివాదాస్పదమవుతుంటుంది. ఎంతలా అంటే సినిమాను రిలీజ్ చేయకుండా బ్యాన్ చేసేలా. ఇప్పుడు మనం మాట్లాడుకోబోయే సినిమా కూడా సేమ్ టు సేమ్ అలాంటిదే. కంటెంట్ పరంగా ఈ సినిమా చాలా వివాదాల ఎదుర్కొంది. అయితే సెన్సార్ కట్ చేసి రిలీజ్ చేశారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే... మిసెస్ చూ అనే మహిళ చుట్టూ ఈ మూవీ కథ తిరుగుతుంది. ఆమె తన ముగ్గురు కూతుర్లతో కలిసి ఒక చిన్న రెస్టారెంట్ నడుపుతుంటుంది. వాళ్ల స్పెషల్ ఐటెమ్ 'క్లేపాట్ కర్రీ'. అంటే మట్టి పాత్రలో ఆవిరి తో చేసే హోమ్‌మేడ్ కర్రీ అన్న మాట. వీరి రెస్టారెంట్ మామూలుగానే నడుస్తుంది. అయితే ఒకరోజు చూ భర్త పిల్లల తో అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో తల్లీ కూతుర్లు అతన్ని చంపేస్తారు. అతని శవాన్ని ఏం చేయాలో తెలియక ముక్కలు ముక్కలుగా నరికి కూర వండి తమ రెస్టారెంట్లకు వచ్చే కస్టమర్లకు పెడతారు. ఆ కర్రీ టేస్ట్ కూడా గొప్పగా ఉండటంతో రెస్టారెంట్ ఉన్నట్లుండి రద్దీగా మారుతుంది. వచ్చే వాళ్లందరూ మనిషి మాంసంతో చేసిన 'క్లేపాట్ కర్రీ' నే కావాలంటారు. దీంతోమిసెస్ చూతో ఆమె కూతుళ్లు రోజు రాత్రిపూట మనుషులను ట్రాప్ చేసి చంపి కూర వండటం మొదలు పెడతారు.రాత్రి నైట్ క్లబ్‌లకు వెళ్లి మగవాళ్లను ముగ్గులోకి దింపడం, ఇంటికి తెచ్చి డ్రగ్స్ ఇచ్చి చంపేస్తుంటారు మిసెస్ చూ కూతుళ్లు, ఆ తర్వాత ముక్కలు ముక్కలుగా కట్ చేసి కర్రీలో కలిపేస్తుంటారు. దీంతో మిసెస్ చూ రెస్టారెంట్ బాగా ఫేమస్ అవుతుంది. ఇదే క్రమంలో పక్క రెస్టారెంట్ ఓనర్స్ జెలసీతో రివెంజ్ ప్లాన్ వేస్తాడు. ఫేమస్ మాస్టర్ చెఫ్ ను పంపి చూ రెసిపీ చేయాలని ఆర్డర్ ఇస్తాడు. అతను రెస్టారెంట్‌కి రావడంతో మిసెస్ చూ కూతుర్లు మాత్రం ఏమీ మాట్లాడకుండా, వాళ్లని కూడా చంపేసి కర్రీలో వండేస్తారు. మరి మిసెస్ చూ ఆమె కూతుళ్ల ఆగడాలు ఎలా ఆగాయా? పోలీసులు వీరిని పట్టుకున్నారా? లేదా? అన్న ప్రశ్నలకు సమాధానలు తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. అత్యంత హింసాత్మక సన్నివేశాలతో సాగే ఈ సినిమా పేరు'క్లేపాట్ కర్రీ కిల్లర్స్'. ఇదొక మలేషియన్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ. సుమారు 93 నిమిషాల నిడివి ఉన్న ఈ సినిమా మలేషియాలో టాప్ హారర్ సినిమాగా ఫేమస్ అయింది. ఈ సినిమా ఏ ఓటీటీలోనూ లేదు. ఇప్పుడు కేవలం Filmdoo వెబ్ సైట్ లో మాత్రమే అందుబాటులో ఉంది. ముందే చెప్పాం కాదా? ఈ సినిమాను పిల్లలతో కలిసి చూడకపోవడం చాలా బెటర్.

# కమల్-రజనీ కాంబోలో సాయిపల్లవి?

తమిళ సినిమా మూలస్తంభాలైన కమల్ హాసన్, రజనీకాంత్‌ల కాంబినేషన్‌లో ఇంతకుముందు దాదాపు 11 సూపర్ హిట్ చిత్రాలు రూపొందాయి. ఆ తర్వాత సూపర్‌స్టార్ ఇమేజ్ కారణంగా ఇద్దరూ వేర్వేరుగా నటిస్తూ వచ్చారు. అలాంటిది సుదీర్ఘకాలం తర్వాత ఈ లెజెండ్స్ ఇద్దరూ కలిసి నటించడానికి సిద్ధమయ్యారు.

### రజనీ హీరోగా, కమల్ నిర్మాతగా...

అయితే దీనికంటే ముందు కమల్‌హాసన్(Kamal Haasan) తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించనున్న చిత్రంలో రజనీకాంత్ హీరోగా (#Thalaivar 173) నటించనున్నారు. దీనికి సుందర్ సి దర్శకత్వం వహించనున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. కానీ, తర్వాత అనూహ్యంగా సుందర్ ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి వైదొలగుతున్నట్లు మీడియా ద్వారా ఒక లేఖను విడుదల చేసి షాకిచ్చారు. దీంతో ఈ చిత్రానికి ఎవరు దర్శకత్వం వహిస్తారనే ఆసక్తి నెలకొంది.

### సాయిపల్లవి?

పార్కింగ్ చిత్రంతో జాతీయ ఉత్తమ దర్శకుడు అవార్డు పొందిన రామ్‌కుమార్ బాలకృష్ణన్ దర్శకత్వం వహించబోతున్నారనేది లేటెస్ట్ టాక్. ఈ భారీ బడ్జెట్ మూవీలో సాయిపల్లవి నటించబోతున్నారని ప్రచారం జరుగుతోంది. అలాగే మరో నటుడు ఖదీర్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



# నిర్బంధంలో జవాన్

## బాలీవుడ్ నటి ఒంటరి పోరాటం

ప్రముఖ బాలీవుడ్ నటి, మాజీ మిస్ ఇండియా సెలీనా జైట్లీ భర్త నుంచి విడాకులు ఇప్పించమని కోరుతోంది. భర్త, ఆస్ట్రియన్ వ్యాపారవేత్త పీటర్ హాగ్ తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడంటూ గృహహింస కేసు పెట్టింది. అతడి వల్ల కోల్పోయిన రూ.50 కోట్లు తిరిగిప్పించాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు యూఏఈలో నిర్బంధంలో ఉన్న తన సోదరుడు, మాజీ ఆర్మీ మేజర్ విక్రాంత్ జైట్లీని తిరిగి తీసుకురావడం కోసం పోరాడుతోంది.

**ఒంటరి పోరాటం**

ఈ క్రమంలో సెలీనా సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. నా జీవితాన్ని అల్లకల్లోలం చేసే తుపాను ఒకటి వస్తుందని.. అప్పుడు పేరెంట్స్ లేకుండా, ఎవరి అండ లేకుండా ఇలా ఒంటరి పోరాట్సం చేయాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. తల్లిదండ్రులు, సోదరుడు, పిల్లలు, ఏ కష్టం వచ్చినా నాతో పాటు నిలబడతానని వాగ్దానం చేసిన వ్యక్తి.. వీళ్లెవరూ లేని రోజు వస్తుందనుకోలేదు.

**సైనికుడి కూతుర్ని**

జీవితం ప్రతీది దూరం చేసింది. నేను నమ్మినవాళ్లు వదిలేసి వెళ్లిపోయారు. నాతో ఉంటానని హామీ ఇచ్చినవాళ్లు మౌనంగా మాట తప్పారు. అయినా ఈ తుపాను నన్ను నిలువునా ముంచేయలేదు. సముద్రంలోకి తీసుకెళ్లకుండా అలల్లా నన్ను ఒడ్డుకు విసిరేసింది. నాలోని ధైర్యాన్ని తట్టిలేపింది. చావును సైతం ఎదిరించే స్త్రీగా నిలవమంది. ఎందుకంటే నేను ఒక సైనికుడి కూతురిని. క్రమశిక్షణ, ధైర్యసాహసాలు, పట్టుదల మా రక్తంలోనే ఉన్నాయి.

**పోరాడుతూనే ఉంటా..**

ప్రపంచం నన్ను పడగొట్టాలనుకున్నప్పుడు ధైర్యంగా లేచి నిలబడటం నేర్చుకున్నా.. గుండె ముక్కలవుతున్నా పోరాడటం నేర్చుకున్నా.. అన్యాయం జరిగినప్పుడు కనికరం అవసరం లేదని తెలుసుకున్నా.. అసాధ్యం అనుకున్నదాన్ని సుసాధ్యం చేసేవరకు ప్రయత్నించడం నేర్చుకున్నా... నా సోదరుడి కోసం నేను పోరాడుతూనే ఉంటా.. అని రాసుకొచ్చింది.





# శ్రీనివాస మంగాపురం

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, దివంగత నటుడు రమేష్‌బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయమవుతున్న సంగతి తెలిసిందే. 'ఆర్‌ఎక్స్ 100, మంగళవారం' చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి రాషా తడాని తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. అశ్వినీదత్ సమర్పణలో చందమామ కథలు బ్యానర్‌పై పి .కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'శ్రీనివాస మంగాపురం' అనే టైటిల్‌ని ఖరారు చేసి, ప్రీ లుక్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు మేకర్స్. ''టైమ్‌లెస్ కల్ట్ ప్రేమకథగా రూపొందుతోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. యాక్షన్, రొమాన్స్ వంటి అంశాలు కూడా ఉంటాయి. తన పాత్ర కోసం జయకృష్ణ ఇంటెన్స్గా సిద్ధం అయ్యారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం మా సినిమాకు మెయిన్ హైలెట్ కానుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com